


వినబడని కేక..
పోస్ట్! పోస్ట్!!

- నాడు ఆ కేకతో వీధి వీధంతా అలర్ట్
- ఉత్తరమా.. మనీ ఆర్డరు రాలేదా అంటూ వాకబు
- భావోద్వేగాలతో పెనవేసుకున్న తపాలా శాఖ
- ఆధునికత అందిపుచ్చుకోలేక.. అట్టడుగుకు
- నేడు అంతర్జాతీయ తపాలా దినోత్సవం



రంగువెలసిన తపాలా పెట్టె

కలికిరి, అక్టోబరు8: పోస్ట్.. పోస్ట్.. ఈ అరుపు వినపడితే నాడు వీధి వీధంతా అలర్ట య్యేది. ట్రింగ్ ట్రింగ్‌మంటూ సెకిల్ బెల్ మోతతో ఆడాళ్లు మగాళ్లు అన్న తేడా లేకుండా ఇళ్ల బయటకు వచ్చేసే వాళ్లు. కార్డు ముక్క, కవరు, మనీ ఆర్డరులాంటివైతే పర్వాలేదుగానీ టెలిగ్రామ్ వచ్చిందంటే బెదిరిపోయేవాళ్లు. ఎందుకంటే అప్పట్లో సాధారణంగా టెలిగ్రామ్ అంటే చావు కబురు తెచ్చిందనే లెక్క. మిలిటరీలో ఉన్న భర్త రాసే జాబు కోసం వారాలపాటు భార్య ఎదురు చూపులు, కొడుకు పంపే మనియార్డరు కోసం ఎదురు చూసే తల్లిదండ్రులు.. ఇంటర్వ్యూలకు హాజరయ్యే నిరుద్యోగులు.. ఇలా ఎన్నెన్నో భావోద్వేగాలకు సంబంధించిన సమాచారాన్ని మోసుకొచ్చే ఆయన ఆ ప్రాంతానికి ఏకైక వార్తాహరుడు. జనానికి ఆయనో హీరో. ఆయనే పోస్ట్ మ్యాన్. ఆయన వాహనం సైకిల్. సంచి నిండా రకరకాల ఉత్తరాలను మోసుకొచ్చే ఆ పోస్ట్ మ్యాన్ ఇప్పుడు లేడు. ఏడాదికో, రెండేళ్లకో ఒకసారి ఏటీఎం కార్డో, ఆధార్ కార్డో, పాన్‌కార్డ్, బ్యాంకు సిబ్బంది పంపే ఏటీఎం కార్డులు ఇచ్చి వెళ్లేందుకు మాత్రమే ఈ కాలం పోస్ట్ మ్యాన్‌లు పరిమితమయ్యారు. కోటాను కోట్ల భారతీయులతో మమేకమై వెలిగిన తపాలా శాఖ ప్రస్తుతం ఓ చారిత్రక గుర్తుగా మిగిలిపోయేందుకు సమీపంలో ఉందా అన్న సందేహాలున్నాయి.

దాదాపు మూడు శతాబ్దాల చరిత్ర


భారత తపాలా శాఖ దాదాపు మూడు శతాబ్దాల చరిత్ర. 1766లో భారత దేశంలో ఈస్ట్ ఇండియా కంపెనీ 'మెయిల్ కంపెనీ' పేరుతో స్థాపించారు. కాలక్రమేణా ఆంగ్లేయులు దీన్ని ప్రజల మధ్య సమాచార మార్పిడి కోసం, ఆ తరువాత ప్రభుత్వం-ప్రజల మధ్య ప్రధానంగా గ్రామీణ ప్రజల సౌకర్యం కోసం విస్తరించారు. స్వాతంత్ర్యం వచ్చే నాటికి దేశంలో 23,344 పోస్ట్ ఆఫీసులుండగా 2016 నాటికి అవి 1,55,015కు చేరుకున్నాయి. ఇందులో 90 శాతం గ్రామీణ ప్రాంతాల్లో మాత్రమే పాదుకున్నాయి. స్వాతంత్ర్యానంతరం 'మెయిల్ కంపెనీ' పేరు తంతి తపాలా శాఖగా మార్చారు. ఆ తరువాత తంతి (టెలిగ్రామ్, టెలిఫోన్) తీసేసి ఇండియా పోస్ట్‌గా మారింది. మనీ ఆర్డర్లు, టెలిగ్రామ్‌లు వంటి ఆకర్షణీయమైన సౌకర్యాలను విస్తృతం చేయడంలో అసామాన్య ఫలితాలను సాధించింది. సామాన్యుడైనా సమీప పోస్ట్ ఆఫీసుకు వెళ్లి టెలిఫోన్ చేసుకునే సౌకర్యం ఉండేది. టెలిగ్రామ్ కూడా పంపే వారు. అందుకే సామాన్యుల నుంచి ధనవంతుల వరకూ తపాలాను ఆదరించారు. ఎక్కడి నుంచైనా దేశంలో ఏ మారుమూల ప్రాంతంలో ఉన్నా గురిచూసినట్లు తపాల సేవలు చేరడానికి 19101 రకాల పోస్టల్ పిన్ కోడ్‌లు ప్రవేశ పెట్టి ఘన విజయం సాధించింది. ప్రపంచంలో తొలిసారిగా బంకతో అంటించే స్టాంపులను మన తపాలా శాఖే ప్రవేశపెట్టింది.

కారుచౌకయిన సమాచార మార్పిడి

ప్రజల మధ్య సమాచార మార్పిడి కోసం ఐదు నయాపైసలకు దొరికే పోస్టు కార్డు ఇప్పుడు ధర కేవలం 50 పైసలు. రిప్లై కార్డు (రూ.1), ఇన్‌ల్యాండ్ లెటర్ (రూ.2.50), ఎన్వలప్ కవర్ (రూ.5) లాంటి వాటిని అందుబాటులో ఉంచి సామాన్య, మధ్యతరగతి, ధనవంతులందరికీ ఒకే విధమైన సేవలను అందిస్తోంది. వాడవాడలా, వీధి వీధినా పోస్టు బాక్సులను ఏర్పాటు చేసి వినియోగదారుల ముంగిట వసతులు కల్పించింది. ఏపీలో 57 సర్కిల్ కార్యాలయాలు, 1510 సబ్ పోస్ట్ ఆఫీసులు, 9101 బ్రాంచి పోస్ట్ ఆఫీసులు, 27,648 తపాలాపెట్టెలతో ఇప్పటికీ మనుగడ సాగిస్తోంది. ఇక దేశ వ్యాప్తంగా పల్లె నుంచి పట్నం వరకూ 4,17,114 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. 1990ల్లో ఈ మెయిల్ ప్రాచుర్యంలోకి రాగానే తపాలా శాఖకు ఎదురు దెబ్బలు మొదలై.. అనంతరం వరుసగా వచ్చిన వాట్సాప్, టెలిగ్రాం తదితర మెసేజింగ్ యాప్‌లు, తదనంతరం పెచ్చరిల్లిన సోషల్ మీడియా ధాటికి తపాలాశాఖ ప్రాభవం మసకబారడం ప్రారంభమైంది. మరో వైపు ప్రైవేటు కార్గో, కొరియర్ సర్వీసులు, పార్శిల్ రవాణాలు అన్నీ కలగలిసి తపాలా శాఖపై ముప్పేట దాడి చేశాయి. దీంతో దాదాపు మూడు శతాబ్దాల చరిత్ర కలిగి రాజధాని ఢిల్లీ నుంచి గ్రామంలో గల్లీ వరకూ అత్యంత విస్తృతమైన నెట్ వర్క్‌తో ప్రజలతో నేరుగా అనుబంధాన్ని పెంచుకున్న తపాలా వ్యవస్థ ఇప్పుడు కుదేలైపోయింది.

పునర్వైభవం కోసం..

ప్రస్తుతమున్న మెయిల్ సర్వీసులను ఆధునీకరించి, తాజాగా డిజిటల్ పేమెంట్స్‌ను అందుబాటులోకి తెచ్చింది. వీటికి తోడు బ్యాంకింగ్ వ్యవస్థను కూడా మొదలు పెట్టింది. పబ్లిక్, ప్రైవేటు రంగం వంటి బ్యాంకింగ్ సర్వీసులన్నీ అందుబాటులోకి తెస్తోంది. పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్‌కు స్పందన లభిస్తోంది. సుకన్య సమృద్ధి యోజన, మహిళా సమ్మాన్ వంటి పథకాలు అన్ని వర్గాల ప్రజలను ఆకర్షిస్తున్నాయి. రికరింగ్ డిపాజిట్లు, నెలవారీ ఆదాయ పథకాలు, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ స్కీములు తదితరాలు తపాలాశాఖను ఆదుకునే విషయంలో అనేక సందేహాలున్నా ఈ శాఖ పునర్వైభవం సాధించాలనే విషయంలో ప్రజలంతా నిస్సందేహంగా కోరుకుంటారు.



కలికిరి తపాలా కార్యాలయం

- ప్రాజెక్టు కోసం రైతులు సర్వం కోల్పోయారు
- కాంట్రాక్టర్లకు లబ్ధి కోసమేనా!
- దాదాపు 3 వంతుల పనులు పూర్తి
- నీట మునగనున్న నాలుగు గ్రామాలు
- ముదివేడు రిజర్వాయర్ భూబాధితుల ఆవేదన

పరిహారం ప్రశ్నార్థకమేనా..?

గత వైసీపీ పాలనలో అధికార దుర్వినియోగానికి పాల్పడి ఇష్టానుసారంగా ప్రాజెక్టును మంజూరు చేసి రైతుల వద్ద నుంచి బలవంతంగా భూములను లాక్కుని రిజర్వాయర్ నిర్మాణ పనులను ఆగమేఘాలపై ప్రారంభించారు. ప్రాజెక్టు నిర్మాణానికి భూములు ఇవ్వడానికి నిరాకరించిన రైతులను పోలీసులు, రెవెన్యూ అధికారులతో రకరకాలుగా బెదిరింపు చర్యలకు పాల్పడి లాక్కున్నారు. కాంట్రాక్టర్‌లకు లబ్ధిని చేకూర్చడానికి చేపట్టిన ప్రాజెక్టును ఎటువంటి అనుమతులు లేకుండానే రాత్రి,పగలు అనే తేడా లేకుండా నిర్మాణ పనులను చకచకా చేపట్టారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా వాటిని ఏమాత్రం ఖాతరు చేయకుండా దాదాపు 3 వంతులకు పైగా పనులు పూర్తి చేశారు. తంబళ్లపల్లె నియోజకవర్గం ముదివేడు సమీపంలో రూ.759.50 కోట్లతో ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. ప్రాజెక్టు నిర్మాణం దాదాపుగా పూర్తి కావస్తున్నా ప్రభుత్వం నుంచి భూనిర్వాసితులకు రావాల్సిన భూపరిహారం, పునరావాసం ఇప్పటి వరకు రాలేదు. ఇలాంటి తరుణంలో ప్రాజెక్టు కోసం సర్వం కోల్పోయిన నిర్వాసితులకు ఏమాత్రం న్యాయం జరుగుతుందోనని గంపెడాశతో ఎదురుచూస్తున్నారు.



నీట మునగనున్న శీతివారిపల్లె గ్రామం



పిచ్చలవాండ్లపల్లె సమీపంలో నిర్మిస్తున్న ప్రాజెక్టు

కురబలకోట, అక్టోబరు 8: వైసీపీ పాలనలో రాష్ట్ర ప్రభుత్వం రూ.2 వేల కోట్ల రూపాయలకు పైగా అంచనా వ్యయంతో పుంగనూరు నియోజకవర్గంలోని ఆవులపల్లె, నేతిగుంటపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గంలోని కురబలకోట మండలం పిచ్చలవాండ్లపల్లె పంచాయతీలో ప్రాజెక్టులకు ప్రభుత్వం 2021లో అనుమతులు మంజూరు చేసింది. కాగా వీటిలో ముదివేడు రిజర్వాయర్ నిర్మాణానికి రూ.759.50 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణ పనులు చేపట్టింది. కాగా ఈ ప్రాజెక్టును కురబలకోట, బి.కొత్తకోట మండలాల పరిధిలో 1077 ఎకరాల్లో నిర్మిస్తున్నారు. ప్రాజెక్టు కోసం వ్యవసాయ భూములు, గ్రామాలు, చెరువులు, కుంటలను కోల్పోతున్నారు. కాగా కురబలకోట మండలంలోని పిచ్చలవాండ్లపల్లె పంచాయతీలో 798.7 ఎకరాలు, కురబలకోట పంచాయతీలో 66.70 ఎకరాలు, ముదివేడు పంచాయతీలో 64.95 ఎకరాలు బి.కొత్తకోట మండలంలోని కోటావూరు పంచాయతీలో 146.05 ఎకరాలు ప్రాజెక్టు నిర్మాణం కోసం ఎంపిక చేసింది. కాగా భూములకు సంబంధించి పలుమార్లు కలెక్టర్, జేసీ, మండల స్థాయి అధికారులు ఎమ్మెల్యే, ఎంపీలు రైతులతో సమావేశం నిర్వహించి భూపరిహారం ఎకరానికి రూ.12.50 లక్షలుగా నిర్ణయించారు. పట్టా, డీకేటీ భూములకు ఒకే ధరను నిర్ణయించారు. రిజర్వాయర్ నిర్మాణం వల్ల కురబలకోట మండలం పిచ్చలవాండ్లపల్లె పంచాయతీలోని శీతివారిపల్లె, కొత్తపల్లె, బి.కొత్తకోట మండలం కోటావూరు పంచాయతీలోని చౌటకుంటపల్లె, దిన్నిమీదపల్లె గ్రామాలు పూర్తిగా నీటమునుగుతాయి. అయితే వీరికి పునరావాసాల కోసం పిచ్చలవాండ్లపల్లె పంచాయతీలో 204 కుటుంబాలు, కోటావూరు పంచాయతీలో 125 కుటుంబాలను ఎంపిక చేశారు. కాగా ప్రాజెక్టు నిర్మాణం కోసం భూములను కోల్పోయే భూనిర్వాసితులకు ప్రభుత్వం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీని మంజూరు చేస్తుంది. ఇందులో భాగంగా భూములు, ఇళ్లను కోల్పోయిన వారి కోసం ప్రత్యేకంగా స్థలాలను మంజూరు చేసి ఇళ్ల నిర్మాణాలను చేపడతారు. కాగా కురబలకోట మండలం పిచ్చలవాండ్లపల్లె పంచాయతీలోని భూనిర్వాసితుల కోసం ముదివేడు క్రాస్ సమీపంలోని తానామిట్ట వద్ద 21.50 ఎకరాలను, బి.కొత్తకోట మండలంలోని కోటావూరు పంచాయతీలో నిర్వాసితుల కోసం 13.50 ఎకరాలను ఎంపిక చేసింది. కాగా ఒక్కొక్క కుటుంబానికి 5 సెంట్ల జాగాతో పాటు అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తామని, ఇంటి నిర్మాణాన్ని సొంతంగా నిర్మించుకునే వారికి రూ.10 లక్షలు, అలా కాకుండా ఇళ్లు నిర్మించుకోలేని వాళ్లకు ప్రభుత్వ నిబంధనల మేరకు ఇళ్ల నిర్మాణాలను చేపట్టి వారికి అప్పగించడంతో పాటు మిగిలిన నగదును వారికి అందచేస్తామని తెలిపారు.

అయితే ఆర్‌ఎన్‌ఆర్ ప్యాకేజీకి సంబంధించి పలుమార్లు జిల్లా, మండల స్థాయి అధికారులు భూనిర్వాసితులతో సమావేశాలు నిర్వహించారు. అయితే త్వరలో స్థలాలు కేటాయించడంతో పాటు ఆ ప్యాకేజీని ఇవ్వనున్నట్లు చెప్పినా ఇప్పటికీ అమలుకు నోచుకోవడం లేదు. అయితే రైతుల భూములలో నిర్మాణ పనులను చేపట్టడంతో ఆ భూములు వ్యవసాయం చేసుకోవడానికి ఏమాత్రం పనికిరావు. కట్ట నిర్మాణ పనుల కోసం మట్టి భారీగా అవసరం కావడంతో దాదాపుగా 400 ఎకరాలకు పైగా పొలాలలోని మట్టిని యంత్రాల సహాయంతో పెద్దపెద్ద గుంతలు పెట్టి ఆ మట్టిని కట్ట నిర్మాణ పనుల కోసం తరలించి ఎందుకూ పనికి రాకుండా చేశారు. కాగా 400 ఎకరాలకు ఏడాదికి రూ.15 వేలు చొప్పున గుత్త ఇస్తామని నమ్మబలికారు. అయితే కేవలం ఏడాది మాత్రం ఇచ్చి ఆ తర్వాత గుత్త సొమ్ము ఇవ్వలేదు ఇలాంటి తరుణంలో ప్రభుత్వం మారడంతో నిర్వాసితుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది.

నివేదికను ప్రభుత్వానికి అందజేశాం..

ప్రాజెక్టుకు సంబంధించి పూర్తి నివేదికను ప్రభుత్వానికి అందజేశాము. గతంలో ఇక్కడ పని చేసిన అధికారులు రైతులకు సంబంధించిన భూముల వివరాలను పూర్తిగా సేకరించి సంబంధింత శాఖాధికారులకు అందజేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు చేపడతాం.

- తపశ్విని, తహసీల్దార్

ప్రాజెక్టు కోసం సర్వం కోల్పోయాం..



మా గ్రామంలో నిర్మిస్తున్న రిజర్వాయర్ కోసం పూర్తిగా భూములు, ఇళ్లను కోల్పోయాం. మేము ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తిగా వ్యవతిరేకించాము. అయితే అధికార పార్టీ నేతలు పోలీసులతో భయపెట్టించడం వలన తప్పనిసరి పరిస్థితులలో ఒప్పుకోవాల్సి వచ్చింది. పలుమార్లు జిల్లా, మండల స్థాయి అధికారులు మాతో సమావేశాలు నిర్వహించి భూపరిహారం, స్థలాలు, ఇళ్ల నిర్మాణాలకు నిధులు ఇస్తామని చెబుతూ మభ్య పెట్టారు. అయితే ఇప్పటి వరకు రావడం లేదు. ఇలాంటి తరుణంలో ప్రభుత్వం మారింది. ఇక వస్తుందో...రాదో కూడా తెలియని పరిస్థితి నెలకొంది.

- ఎస్.భూమిరెడ్డి, శీతివారిపల్లె, కురబలకోట మండలం

కాంట్రాక్టర్‌ల కోసం బలైపోయాం..



వైసీపీ ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టర్‌లకు లబ్ధిని చేకూర్చడానికి ఈ ప్రాజెక్టును మంజూరు చేశారు. మూడు పంటలు పండే మా భూములను కోల్పోయాం. మాకు వ్యవసాయం తప్ప మరేమీ తెలియదు. ఇలాంటి పరిస్థితులలో ప్రాజెక్టు నిర్మాణం అన్నీ పోగొట్టుకున్నాము. దీంతో మేము రోడ్డున పడాల్సిన దుస్థితి నెలకొంది. మాకు ఏమి చేయాలో దిక్కుతోచడం లేదు. గతంలో నిర్ణయించిన పరిహారం మేము తిరస్కరించినా మా మాటలను లెక్కచేయలేదు. అంతేకాకుండా చుట్టుపక్కల భూముల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ప్రభుత్వం స్పందించి భూనిర్వాసితులకు న్యాయం చేసి ఆదుకోవాలి.


- మోహన్‌రెడ్డి, శీతివారిపల్లె, కురబలకోట మండలం

గజలక్ష్మీ.. పాహిమాం

రాయచోటిటౌన్, అక్టోబరు 7: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. వీరభద్రాలయంలో భద్రకాళీ అమ్మవారు గజలక్ష్మీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. మదనపల్లె వాసవీ కన్యాకాపరమేశ్వరీదేవి ఆలయం లో సంతానలక్ష్మీ అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. రైల్వేకోడూరు ఆర్యవైశ్య సమాజంలో గౌరీపూజ అలంకారం, రాజంపేట అమ్మవారిశాలలో అమ్మవారు మీనాక్షిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.



రాజంపేట అమ్మవారిశాలలో మీనాక్షిదేవి అలంకరణ



మదనపల్లె అమ్మవారిశాలలో సంతానలక్ష్మీ అలంకరణ



రాయచోటి వీరభద్రాలయంలో గజలక్ష్మీదేవి అలంకారం



రైల్వేకోడూరులో గౌరీపూజ అలంకారం

పల్లె పండుగ వారోత్సవాలకు సన్నద్ధం

- స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో భూమిపూజలు, శంకుస్థాపనలు : కలెక్టర్ చామకూరి శ్రీధర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

రాయచోటి(కలెక్టరేట్), అక్టోబరు 8: రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు జిల్లాలో అన్ని పంచాయతీల్లో పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలను విజయవంతంగా చేసేందుకు సన్నద్ధంగా ఉన్నామని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. మంగళవారం విజయవాడ నుంచి కలెక్టర్లు, ఉపాధి హామీ సమన్వయ శాఖల అధికారులతో ఉప ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 14 నుంచి 20 వరకు చేపట్టే పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఆగస్టు 23న జిల్లాలో నిర్వహించిన గ్రామసభల ద్వారా రూ.71 కోట్ల విలువైన పనులకు తీర్మానాలు చేశామని, ఇప్పటికే రూ.65 కోట్ల మేర పనులకు పరిపాలన మంజూరు ఉత్తర్వులు జారీ చేశామని వివరించారు. సాంకేతిక సమస్యను పరిష్కరించి పరిపాలన అనుమతులు జారీ చేస్తామన్నారు. జిల్లాలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో భూమి పూజలు, శంకుస్థాపనల ద్వారా పనులు ప్రారంభించేందుకు రూట్ మ్యాప్ సిద్ధం చేశామన్నారు. సంక్రాంతిలోగా పనులన్నీ పూర్తి చేయడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ పల్లెపండుగ వారోత్సవాల్లో చేపట్టే భూమిపూజ, శంకు స్థాపనల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, సర్పంచులు, స్థానిక ప్రజా ప్రతినిధులందరినీ భాగస్వాములను చేయాలన్నారు. ఈ వారోత్సవాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, చేపట్టే పనుల వివరాలను గ్రామాల్లో ప్రదర్శించాలని సూచించారు. సమావేశంలో పంచాయతీరాజ్, డ్వామా, ఆర్‌డబ్ల్యుఎస్, పంచా యతీ, సచివాలయ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మద్యం షాపులకు దరఖాస్తుల జోరు

- *111 షాపులు.... 1020 దరఖాస్తులు*

(రాయచోటి- ఆంధ్రజ్యోతి): జిల్లాలో మద్యం దుకాణాలకు దరఖాస్తుల జోరు పెరిగింది. తొలుత దరఖాస్తులు కొంత మందకొడిగా వచ్చినా.. గడుపు సమీపిస్తున్న కొద్దీ దరఖాస్తుల సంఖ్య పెరుగుతోంది. జిల్లాలో 8 సర్కిళ్లలో 111 మద్యం దుకాణాలు ఉండగా మంగళవారం సాయంత్రానికి 1020 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తులు వేయడానికి బుధవారం ఒక రోజే గడువు మిగిలి ఉంది. గత ప్రభుత్వంలో ప్రభుత్వమే మద్యం దుకాణాలను నిర్వహించింది. అయితే మందుబాబులు కోరుకున్న బ్రాండ్లను కాకుండా ప్రభుత్వానికి నచ్చిన బ్రాండ్లను అందుబాటులో ఉంచింది. దీనిపై మద్యం ప్రియుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఈ నేపధ్యంలో కొత్తగా ఏర్పడిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం మద్యం ప్రియులు కోరుకున్న బ్రాండ్లను అందుబాటులో ఉంచి.. మద్యం దుకాణాల నిర్వహణ ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పనుంది. ఈనేపధ్యంలో ఈ దుకాణాలకు ఈనెల 1 నుంచి 9 వరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నారు.

జిల్లాలో రాయచోటి, లక్కిరెడ్డిపల్లె, రాజంపేట, కోడూరు, మదనపల్లె, ములకల చెరువు, వాయల్పాడు, పీలేరు ఎక్సైజ్ సర్కిల్ పోలీసుస్టేషన్లు ఉన్నాయి. రాయచోటి సర్కి ల్‌లో 217 దరఖాస్తులు, లక్కిరెడ్డిపల్లె 60, రాజంపేట 97, కోడూరు 80, మదనపల్లె 406, ములకలచెరువు 78, వాయల్పాడు 38, పీలేరు సర్కిల్‌లో మంగళవారం సాయంత్రానికి 44 దరఖాస్తులు వచ్చాయి. బుధవారానికి దరఖాస్తులు మరిన్ని పెరిగే అవకాశం ఉంది. ఈనెల 11న జిల్లా కేంద్రంలో ఈ దరఖాస్తులన్నింటికీ లక్కీ డిప్ ద్వారా డ్రా తీయనున్నారు. ఈ మేరకు జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

సీఐ తల్లిది హత్యే

- 10 రోజుల తరువాత వెలుగులోకి

మదనపల్లె అర్బన్, అక్టోబరు 8: ఆమె ఓ పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తల్లి. పది రోజుల కిందట మిస్సింగ్ అయింది. సీరియస్‌గా తీసుకున్న జిల్లా పోలీసు యంత్రాంగం రెండు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు నేర చరితుడు కావడంతో పోలీసులకు చిక్కకుండా దృశ్యం సినిమా తరహాలో మొబైల్ ఫోన్, సిమ్ ఇంట్లోనే పడేసి పరారయ్యాడు. అంతేకాకుండా విమానాల్లో తిరుగుతూ, జల్సాలు చేశాడు. అన్ని కోణాల్లో విచారించిన పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో ఆచూకీ గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.విశ్వసనీయ సమాచారం మేరకు..

మదనపల్లెకు చెందిన నాగేంద్రప్రసాద్ ధర్మవరం వన్‌టౌన్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన తల్లి స్వర్ణకు మారి (వాల్మీకిపురం మండలం మంచూరు స్వగ్రామం) పట్టణ శివారులోని జగన్ కాలనీలో సొంత ఇంట్లో ఒంటరిగా జీవిస్తోంది. ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్న స్వర్ణ కుమారి చుట్టుపక్కల అందరితో కలివి డిగా వుండేది. ఈ క్రమంలో ఆమె ఇంటి ఎదురుగా వుండే వెంకటేష్ (గతంలో మంచూరు గ్రామ యువకుడు) స్వర్ణకు మారికి ఇంటి వస్తువులు, సరుకులు తెచ్చి స్తూ సహాయంగా వుండేవాడు. ఈ క్రమంలో వెంకటేశ్ అవసరాల కోసం స్వర్ణకుమారి వద్ద రూ.5లక్షల దాకా అప్పు చేశాడు. స్వర్ణ కుమారికి భక్తి భావం ఎక్కువగా వుండడంతో గత నెల 28న ఉదయం ఓ పూజారి వద్దకు తీసుకెళ్తానని వెంకటేశ్ ఆమెను ద్విచక్ర వాహ నంలో తీసుకెళ్లాడని తెలిసింది. అప్పటి నుంచి స్వర్ణకుమారి ఫోన్ స్విచ్ఆఫ్ వచ్చినట్లు స్థానికులు చెప్పారు. మూడు రోజులైనా ఆమె ఇంటికి తిరిగి రాకపోవడంతో కాలనీవాసులు స్వర్ణకుమారి కుమా రుడు నాగేంద్రప్రసాద్‌కు సమాచారం ఇచ్చారు. స్వర్ణకు మారి కనిపించడం లేదని నాగేంద్రప్రసాద్ 2వ తేదీ మదనపల్లె తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

నగలు కుదవ...

విమానాల్లో ప్రయాణాలు

స్వర్ణకుమారిని కిడ్నాప్ చేసిన వెంకటేశ్ ఆమె ధరించిన బంగారు నగల ను పట్టణంలోని ప్రైవేటు ఫైనాన్స్‌లో కుదవ పెట్టి డబ్బు తీసుకున్నాడు. ఈ డబ్బులో కొంత ఇంట్లోనే దాచి మిగిలిన డబ్బుతో పరారయ్యాడు. పోలీసులకు చిక్కకుండా మొబైల్ ఫోన్, సిమ్ కార్డులు పడేసి వెళ్లిపోయాడు. అంతేకాకుండా స్వర్ణకుమారి మొబైల్ ఫోన్‌ను కాల్‌ఫార్వర్డ్ చేసినట్లు తెలి సింది. దీంతో ఇతని ఆచూకీ కనిపె ట్టేందుకు పోలీసులు తలమునకలయ్యారు. వెంకటేశ్ స్నేహితులపై పోలీసులు నిఘా వేశారు. ఈ క్రమం లో బెంగళూరులో వున్న వెంకటేశ్ మరో ఫోన్ సిమ్ వాడుతున్నట్లు అనుమానం వచ్చిన పోలీసులు ఆ కోణం లో దర్యాప్తు మొదలెట్టారు. రెండు రోజుల కిందట ఒక ప్రాంతం నుంచి వెంకటేశ్ స్విగ్గీలో ఆహారం ఆర్డర్ పెట్టాడు. దీనిపై నిఘా వేసిన పోలీసులు బెంగళూరు వెళ్లి వెంకటేశ్‌ను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.



గుంతలో నుంచి సంచితో వెలికితీసిన స్వర్ణకుమారి మృతదేహం



విచారణలో వెలుగు చూసిన వాస్తవాలు

వెంకటేశ్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు నిందితుడిని విచారించారు. స్వర్ణకుమారిని కిడ్నాప్ మొదలు ఆమె హత్య వరకు జరిగిన ఘటనలపై పోలీసులకు వివరించినట్లు సమాచారం. పోలీసులు మంగళవారం వెంకటేశ్‌ను వెంటబెట్టుకుని స్థానిక అయోధ్యనగర్ సమీపంలోని శ్మశానవాటికకు వెళ్లారు. అక్కడ ఓ సమాధి కింద స్వర్ణకుమా రి మృతదేహాన్ని పూడ్చినట్లు చెప్పడంతో పోలీసులు, తహసీల్దార్ ఖాజాబీ, ప్రభు త్వాస్పత్రి వైద్యులు శ్మశానానికి చేరుకు న్నారు. ఇదివరకే ఒక శవాన్ని పూడ్చిన చోటే, గో యి తీసి అక్కడే స్వర్ణకుమారి మృతదేహాన్ని పూడ్చి వుండడాన్ని గుర్తించారు. వైద్యులు అక్కడే స్వర్ణకుమారి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

హత్య వెనుక అనిల్ పాత్ర..

వెంకటేశ్‌కు మదనపల్లె పట్టణం గజ్జెల కుంట యువకుడు అనిల్ పరిచితుడు. స్వర్ణకుమారిని కిడ్నాప్ చేసిన వెంకటేశ్ అనిల్ ఇంటికి తీసు కెళ్లినట్లు సమాచారం. అక్కడే స్వర్ణకుమారిని తుదముట్టించినట్లు తెలుస్తోంది. ప్రైవేటు కారును అద్దెకు తీసుకుని మృతదేహాన్ని గోనెసంచెలో చుట్టి అదే రోజు పోతబోలు గ్రామానికి తీసుకెళ్లగా గ్రామస్థులు వీరిని ప్రశ్నించడంతో తిరిగి పట్టణానికి చేరుకు ని అయోధ్యనగర్ సమీపంలోని శ్మశానవాటికలో పూడ్చినట్లు విచార ణలో తెలిసింది. కాగా వెంకటేశ్, అనిల్ ఇద్దరూ గంజాయికి అలవాటు పడి గతంలో నేరాలు చేసినట్లు, అసాంఘిక కార్యక్రమాలు చేస్తున్నట్లు సమాచారం. మదనపల్లె వన్, టూటౌన్, తాలుకా, రూరల్ పోలీస్‌స్టేషన్ల సీఐలు చాంద్‌బాషా, రామచంద్ర, కళా వెంకటరమణ, రమేష్, తాలుకా ఎస్ఐ చంద్రమోహన్ సంయుక్తంగా ఈ కేసును దర్యాప్తు చేశారు. శ్మశానవాటికలో స్వర్ణ కుమారి మృతదేహాన్ని వెలికి తీసినప్పుడు ఆమె కుమారుడు నాగేంద్ర ప్రసాద్, కుటుంబీకులు పోస్టుమార్టం అనంతరం పక్కనే తవ్విన మరో గోతిలో స్వర్ణకు మారి అంత్యక్రియలు చేశారు.





నిందితులు వెంకటేశ్, అనిల్ (ఫైల్‌ఫోటోలు)



గొయ్యి తీసి పూడ్చడానికి సిద్ధం చేసిన ఏర్పాట్లు - చిత్రంలో కుమారుడు, కుటుంబీకులు


నందలూరు: మహాలక్ష్మిగా కాళికాంబ


సుండుపల్లె: మహాలక్ష్మి అలంకరణలో మారెమ్మ


వసపులవాండ్లపల్లెలో మహాలక్ష్మి అలంకారంలో దుర్గమ్మ


పెనగలూరులో మహాలక్ష్మిగా దర్శనమిస్తున్న కామాక్షమ్మ


అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో మహాలక్ష్మి అలంకారంలో అమ్మవారు

లక్ష్మీ.. క్షీర సముద్ర రాజ తనయా...

రాయచోటిటౌన్, అక్టోబరు 8: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం వీరభద్రాలయంలో భద్రకాళి, పాతరాయచోటిలోని అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు గజలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చారు. కొత్తపేట రామాపురంలో చౌడేశ్వరి గాయత్రి అలంకారంలో, ఉమామహేశ్వరి దేవస్థానంలో అమ్మవారు రాజరాజేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

పెనగలూరు : పెనగలూరులోని నయనాధీశ్వరస్వామి ఆలయంలో కామాక్షమ్మ లక్ష్మీదేవిగా అనుగ్రహించారు. వినాయకనగర్‌లో సోమవారం రాత్రి ముదిరాజ్ సంఘం సభ్యులు పూజలు నిర్వహించారు.

గాలివీడు: గుండ్లచెరువులో దుర్గమ్మ మహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. మండలంలోని పూజారివాండ్లపల్లి, ఇరుగులమ్మ ఆలయంలో కూడా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

సుండుపల్లి: మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారిని మహాలక్ష్మి దేవిగా అలంకరించారు.

నందలూరు: నాగిరెడ్డిపల్లెలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో కాళికాంబ మహాలక్ష్మి అలంకారంలో, వాసవీ కన్యకా పరమేశ్వరి మీనాక్షి దేవి అలంకారంలో దర్శనమిచ్చారు

రాజంపేట టౌన్: రాజంపేట పట్టణంలోని చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారు విజయలక్ష్మి అలంకారంలో, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు మీనాక్షిగా, వెంకటరాజంపేటలోని కనకదుర్గా ఉమామహేశ్వరి ఆలయంలో లలితాదేవిగా అనుగ్రహించారు.

రామాపురం: మండలంలోని నీలకంఠ్రావుపేట అమ్మవారిశాలలో కన్యకా పరమేశ్వరి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. దర్బారు సాయినగరులో మాతాజీని గజలక్ష్మిగా భక్తులు దర్శించుకున్నారు.

చిన్నమండెం: కన్యకా పరమేశ్వరి గజలక్ష్మిగా దర్శనమిచ్చారు.

లక్కిరెడ్డిపల్లె: మండల కేంద్రంలోని సర్వమంగళాదేవి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని సరస్వతిగా అలంకరించారు.

రాజంపేట: మన్నూరులోని ఉదయగిరి ఎల్లమ్మ కాత్యాయని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

రైల్వేకోడూరు: రైల్వేకోడూరు ఆర్యవైశ్య సమాజంలో అమ్మవారు గౌరీపూజ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఒంటిమిట్ట : ఒంటిమిట్టలో వాసవీమాత త్రిపురసుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. .

14న లక్కిరెడ్డిపల్లె మండల సర్వసభ్య సమావేశం

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 8: ఈ నెల 14వ తేదీన సోమవారం 2 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఏవో గురుప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రోడ్డు రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరవుతారని ఆయ తెలిపారు.

గ్రామాభివృద్ధికి సహకరించండి


ఎంపీడీవోను సన్మానిస్తున్న రెడ్డయ్య బృందం

పెనగలూరు, అక్టోబరు 8 : మండలంలోని సిద్దవరం గ్రామ పంచాయతి పరిధిలో గ్రామాల్లో నెలకొన్న తాగునీరు, రోడ్లు, వీధిలైట్లు, మురుగుకాలువలు తదితర సమస్యల పరిష్కారంలో సహకారం అందించాలని టీడీపీ నాయకులు న్యాయవాది రెడ్డయ్య, ఎంపీడీవో విజయరావును కోరారు. మంగళవారం సాయంత్రం ఎంపీడీవోను కలిసిన ఆయన గ్రామ పరిధిలో నెలకొన్న సమస్యలను వివరించారు. అనంతరం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గంగయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

నందలూరు, అక్టోబరు 8 : మండలంలోని ప్రజల సమస్య ల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీడీవో సుజాతమ్మను రాజంపేట జనసేనపార్టీ సమన్వయకర్త అతికారి దినేష్ కోరారు. మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆయన ఎంపీడీవోను కలిసి శుభాకాంక్షలు తెలియజేసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కొట్టె శ్రీహరి, తోట కేదార్‌నాథ్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరులో ఓ మోస్తరు వర్షం

పెనగలూరు, అక్టోబరు 8: మండలంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. దాసపల్లె, నారాయణ నెల్లూరు చక్రంపేట, నల్లపురెడ్డిపల్లె, గోవిందంపల్లె, ముద్రపల్లె తదితర ప్రాంతాల్లో వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు..

పారిశుధ్యం, తాగునీటి నాణ్యతపై దృష్టి సారించాలి


మాట్లాడుతున్న డీపీఎంవో డాక్టర్ రియాజ్‌బేగ్

రాయచోటిటౌన్, అక్టోబరు 8: వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై ఆశ వర్కర్లు దృష్టి సారించాలని డీపీఎంవో డాక్టర్ రియాజ్‌బేగ్ ఆదేశించారు. రాయచోటి మున్సిపాలిటీ కొత్తపేట రామాపురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశాడే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి కాలుష్యంలో ఆహారంలో నాణ్యత లోపించ వచ్చునన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించకపోతే వివిధ రకాల వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. చేతుల పరిశుభ్రత, ఆశ యాప్‌లో అప్‌డేట్ చేయడం, ఐఎఫ్ఏ టాబ్లెట్స్, ఐఎఫ్ఏ సిరప్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం సంబేపల్లె మండలంలోని మొటుకువాండ్లపల్లిలో 104 సేవలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంవో డాక్టర్ వాసీమ్, హెల్త్‌సూపర్‌వైజర్ నూర్జహాన్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశకార్యకర్తలు, 104 వాహన సిబ్బంది పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె : ముక్కావారిపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ రూప ఆధ్వర్యంలో ఆశాడే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరు ఇంట్లో తయారు చేసుకున్న పదార్థాలనే తినేలా ప్రోత్సహించాలన్నారు. అలాగే సీజనల్ వ్యాధులు, వ్యాక్సిన్‌లు, టీకాలు, రక్తహీనత, పౌష్టికాహార లోపం, గర్భిణులు, బాలింతలు, శిశువుల సంరక్షణకు సంబంధించిన పలు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాములేరులో చెత్త డంపింగ్


పాములేరులో పడేసిన చెత్త

ఓబులవారిపల్లె, అక్టోబరు 8 : మం డల కేంద్రానికి వెళ్లేదారిలో ఉన్న పాములేరు బ్రిడ్జిలో చుట్టుపక్కల గ్రామా లకు చెందిన చెత్తను డం పింగ్ చేస్తున్నారని పలు వురు రైతులు ఆరోపిస్తున్నా రు. శేషాచల అడవుల నుంచి ఏర్లు వంకల ద్వారా వచ్చే వర్షపు నీరు ఈ ఏరు ద్వారానే చెరువులకు చేరి రైతులకు జీవనాధారంగా మారుతోందని తెలి పారు. అయితే, చెత్తను ట్రాక్టర్ల ద్వారా తరలించి పాములేరులో పడేయడంతో ప్లాస్టిక్ వ్యర్థాలు చెరువులోకి చేరుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువలు, కుంట లను ఆక్రమించి నీరు వెళ్లేందుకు కొందరు ఆటంకాలు కలిగిస్తున్నారని ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి : జేడీఏ


రైతులతో మాట్లాడుతున్న జేడీఏ చంద్రానాయక్

సంబేపల్లె, అక్టోబరు8: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి సాధించవచ్చునని వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు చంద్రానాయక్ తెలిపారు. మంగళవారం ఎస్. సోమవరం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులతో మాట్లాడారు. వేరుశనగలో విత్తనశుద్ధి ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. ఎరువుల యాజమాన్యం ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పథకాలను వివరించారు. రైతు సేవా కేంద్రాల్లో యూరియా పాస్పేట్ వంటి ఎరువులు ప్రభుత్వ ధరలకే అందిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణం, పురుగుమందుల పిచికారీ వంటి చర్యలను వివరించారు. 80 శాతం సబ్సిడీతో ఉలవలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు వెంకటమోహన్, కిశోర్ నాయక్, రైతు సేవా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గాలివీడు: మెళకువలు పాటిస్తే అధిక దిగుబడు సాధ్యమని లక్కిరెడ్డిపల్లె వ్యవసాయ సహాయ సంచాలకులు మేష జయరాం, మండల వ్యవసాయ అధికారి మురళీధర్ తెలిపారు. మంగళవారం గరుగుపల్లి పంచాయతీలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సస్యరక్షణ పద్ధతుల ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు.

PUBLIC NOTICE

Under instructions from my client M/s Shriram Finance Limited, RAYACHOTY Branch. I issue the following notice. My client company intends to grant a loan facility to **Smt. Sugavasi Subhashini** W/o **Sugavasi Palakondrayudu** R/o D.No. 7/44-A,Sivalayam Street, Masapeta, Rayachoty Town, Post, Mandal, under equitable mortgage by way of deposit of title deeds in respect of the schedule mentioned property. Hence the public at large, banks, financial institutions or any individual money lenders are hereby informed that if any objections regarding the said loan, the public shall inform in writing within seven days from the date of this notice for the below mentioned schedule property, otherwise it shall be deemed that there are no objection from anybody and any objections received after seven days will not binding upon my client's company for the below schedule property. **SCHEDULE OF PROPERTY**:-Annamayya Dist. erstwhile YSR Kadapa District, Rayachoty sub. Reg. Dist. Rayachoty Mandal & Municipality at Kaspa Gollapalli Village Polam in **Sy. No. 1/1C2, 1/1C3,** Vijayalakshmi Paradise Homes Apartment Semi finished (East Face Flat No. 402 in Fourth Floor) havind D.No. 5/143-1/VKPH/402 with assessment no. 1121447544, admeasuring 1170.72 square feets (including common area and car parking area) situated in building "VIJAYAKETHANA PARADISE HOMES" Apartment **Bounded by:** East – Corridor, West - Set back area open to sky, North - Set back area opens to sky, South - Totlot area open to Sky (Property covered in registered sale deed No. 6283/2024 S.R.O. Rayachoty)

C. SUNIL KUMAR REDDY, B.A., B.L., ADVOCATE, Rayachoty, 9441738746

PUBLIC NOTICE

Under instructions from my client M/s Shriram Finance Limited, RAYACHOTY Branch. I issue the following notice. My client company intends to grant a loan facility to **Chirasani Vema Reddy** S/o **C. Chinnappa Reddy,** Reddyvaripalli H/o Chemalacheruvu palli Village, Post, Galiveedu Mandal, Annamayya District under equitable mortgage by way of deposit of title deeds in respect of the schedule mentioned property. Hence the public at large, banks, financial institutions or any individual money lenders are hereby informed that if any objections regarding the said loan, the public shall inform in writing within seven days from the date of this notice for the below mentioned schedule property, otherwise it shall be deemed that there are no objection from anybody and any objections received after seven days will not binding upon my client's company for the below schedule property. **SCHEDULE OF PROPERTY**:- The property is situated Annamayya Dist. erstwhile YSR Kadapa District, Lakkireddypalli Sub. Reg. Dist. Galiveedu Mandal at Galiveedu Village Polam in **Sy. No. 1756** an extent of 80.5 square yards out of Ac. 2-43 cents **Bounded by:** East – Site in Plot No. C2 of Mittapalli Krishna Reddy, West - Site of Kudumula Anjaneyulu Reddy, Mittapalli Battlu Reddy, Khadar Basha, North - Kadiri to Rayachoty Road, South - Site in Plot No. A1 of P. Chowdappa. **Measuring :** East-West 11 1/2 Feets, North-South = 63 feets (Property covered in registered sale deed No. 1056/2023 (S.R.O. Rayachoty)

C. SUNIL KUMAR REDDY, B.A., B.L., ADVOCATE, Rayachoty, 9441738746

PUBLIC NOTICE

Under instructions from my client M/s Shriram Finance Limited, RAYACHOTY Branch. I issue the following notice. My client company intends to grant a loan facility to **Smt. Vallepu Rukminamma** W/o **Vallepu Reddeppa** R/o D.No. 11-48, Jettipalem Street, Vayalpadu Village Post, Mandal, Annamayya District under equitable mortgage by way of deposit of title deeds in respect of the schedule mentioned property. Hence the public at large, banks, financial institutions or any individual money lenders are hereby informed that if any objections regarding the said loan, the public shall inform in writing within seven days from the date of this notice for the below mentioned schedule property, otherwise it shall be deemed that there are no objection from anybody and any objections received after seven days will not binding upon my client's company for the below schedule property. **SCHEDULE OF PROPERTY**:- The property is situated Annamayya Dist. erstwhileChittorDistrict, Vayalpadu Sub. Reg. Dist. Vayalpadu Mandal at Vayalpadu Grampanchayat, Vayalpadu Village Polam in **Sy. No. 1342/2** an extent of 0-02 1/2 RCC Building with old door no. 11-21-10 and present D.No. 11-48 in Ward No. 11 at Jettipalem Street, **Bounded by:** East – House of Ragala Chinnamma D.No. 11-15-2, West - House of Chintala Varada Reddy, North - Veedhi (Street), South - Veedhi (Street) **Measuring :** East-West (Width) 4 3/5 Yards, North-South (Length) = 25 Yards. RCC building with doors, door frames, windows, almaras and all fittings attached to the building with easementary right. (Property covered in registered sale deed No. 201/2015 (S.R.O. Vayalpadu)

C. SUNIL KUMAR REDDY, B.A., B.L., ADVOCATE, Rayachoty, 9441738746

భూసార పరీక్షలతో ఎరువుల వాడకం తగ్గించవచ్చు


ఉద్యాన పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

రైల్వేకోడూరు, అక్టోబరు 8: ప్రతి రైతు భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వాడకాన్ని తగ్గించుకోవచ్చునని ఊటుకూరు ఉద్యాన పరిశోధనా స్థానం శాస్త్రవేత్త ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మంగళ వారం రైల్వేకోడూరు మండలంలోని కేఆర్ కండ్రిగ, వెంకటరెడ్డిపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో రసాయనాల వినియోగం తగ్గించాలని కోరారు. రైల్వేకోడూరు ఉద్యాన పరిశోధనా స్థానం శాస్త్రవేత్త శ్రీధర్ మాట్లాడుతూ అరటి, బొప్పాయిలో కంచెలుగా జొన్న, మొక్కజొన్న, అవిశలను వేసుకుంటే వైరస్ తెగుళ్లను అరికట్టుకోవచ్చునని తెలిపారు. అరటి, బొప్పాయి, మామిడి పంటల్లో అధిక దిగుబడులు సాధించే ప్రక్రియలను రైతులకు వివరించారు. రైతులు విత్తన శుద్ధి ఖచ్చితంగా చేయాలని తెలిపారు. రైల్వేకోడూరు వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులు పంటలకు మేలు చేస్తాయని తెలిపారు. అనంతరం పలు ఉద్యాన పంటలను పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వీహెచ్ఏ రాజేష్, కరీం, సర్పంచ్ హరికృష్ణారెడ్డి, రైతులు శ్రీనివాసరాజు, వెంకటసుబ్బరాజు, సుబ్బరామరాజు, పశుసంవర్ధక, మార్కెటింగ్ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి


బాల కార్మికుల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ చేస్తున్న అధికారులు

నందలూరు, అక్టోబరు 8 : బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సీడీపీవో రామలక్ష్మి సూచించారు. స్థానిక పోలీసు స్టేషన్ వెనుకవైపున ఉన్న భగత్ సింగ్ నగర్‌లో నివాసం ఉంటున్న బాలకార్మికులు గురునాథం, త్యాగరాజ్, గురునాధం ధను, పవన్ చిత్తు పేపర్లు, ప్లాస్టిక్ పేపర్లు సేకరించి అమ్ముకుంటున్నట్లు సమాచారం అందడంతో వారి ఇంటివద్దకు వెళ్లి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ చేశారు. దసరా సెలవుల అనంతరం పిల్లలను పాఠశాల హాస్టల్లో చేర్పించేందుకు ఒప్పుకున్నారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజంపేట సీపీయూ శైలజ, ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ శంకర్‌నాయక్, మహిళా పోలీసు సోఫియా, అంగన్వాడీ వర్కర్‌లు బల్కిష్, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

నేడు కట్టవారిపల్లె, చక్రంపేట ఫీడర్లలో కరెంటు కోత

పెనగలూరు, అక్టోబరు 8 : మండల పరిధిలోని చక్రంపేట, కట్టవారిపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంటు కోత ఉంటుందని, ఏఈ సయ్యద్ షఫీ తెలిపారు. పొందలూరు, వడ్డిపల్లె, చక్రంపేట, కాకర్లవారిపల్లె, వెంకటనారాయణపల్లె, వడ్డిపల్లె, గూడెంపల్లె, లక్ష్మీపురం, ముద్రపల్లె, కడిమేవారిపల్లె, మూగవారిపల్లె, కట్టవారిపల్లె, రేగుంటవారిపల్లె, అప్పయ్యరాజుపేట తదితర గ్రామాల్లో విద్యుత్ లైన్లకింద చెట్ల తొలగింపు, మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

గిరిజనులకు పట్టాలిచ్చి ఇళ్లు కట్టించాలి: సీపీఐ


కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న ప్రజా సంఘాల నాయకులు

రాయచోటి(కలెక్టరేట్), అక్టోబరు 8: గిరిజనులకు మంజూరు చేసిన ఇళ్ల స్థలాలకు పట్టాలిచ్చి ప్రభుత్వమే ఇళ్లు నిర్మించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, పీలేరు నియోజకవర్గ కార్యదర్శి టీఎల్ వెంకటేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఉదయం కేవీపల్లి మండలం మఠంపల్లి గ్రామ పంచాయతీ కలికిరివాండపల్లెలో నివాసముంటున్న గిరిజనులతో కలసి ఈ మేరకు కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సీపీఐ పోరాట ఫలితంగా గిరిజనులకు ఇళ్ల స్థలాలు కేటాయించినట్లు తెలిపారు. అప్పుడున్న రాజకీయ నాయకులు రోడ్డు పక్కన ఎస్టీ గిరిజనులు ఉండకూడదన్న వివక్షతో అధికారుల మీద ఒత్తిడి తెచ్చి పట్టాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి సుధీర్, ధర్మ, గిరిజనులు, చెంగన్న, రమణమ్మ,పాపయ్య, చెంగయ్య, అమ్ములు, కస్తూరి విజయమ్మ, కుమార్ పాల్గొన్నారు.

వసతి గృహాల్లో జడ్జి తనిఖీలు


హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి ప్రసూన

సుండుపల్లి, అక్టోబరు 8: వసతి గృహాల్లో మౌలిక వసతులపై రాయచోటి సీనియర్ సివిల్ జడ్జి ప్రసూన ఆరా తీశారు. మంగళవారం సుండుపల్లి మండల కేంద్రంలోని ఎస్సీ, బీసీ బాలుర, ఎస్సీ బాలికల, గిరిజన బాలుర గురుకుల వసతి గృహాలను ఆమె పరిశీలించారు. ఎస్సీ వసతి గృహంలో పగిలిపోయిన ఫ్లోరింగ్ పగిలిపోవడం, కిటికీలకు మెష్, మరుగుదొడ్లకు తలుపులు, ప్రధాన ద్వారానికి గేటు, తాగునీటి సౌకర్యం లేకపోవడం గుర్తించారు. గిరిజన బాలుర గురుకుల వసతి గృహానికి ప్రహరీ గోడ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించారు. గుట్టకింద రాచపల్లి ఎస్సీ బాలికల, బాలుర వసతి గృహాల్లో సమస్యలను గుర్తించారు. ఎక్కడా నీటి శుద్ధి యంత్రాలు లేవని, గుర్తించిన సమస్యలను హైకోర్టుకు నివేదిస్తామని ఆమె తెలిపారు.

హర్యానాలో బీజేపీ విజయంపై సంబరాలు

రాజంపేట, అక్టోబరు 8 : హర్యానా రాష్ట్రంలో బీజేపీ విజయం సాధించడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నంద్యాల జిల్లా ఇన్‌చార్జి పోతుగుంట రమేష్‌నాయుడు మాట్లాడుతూ బీజేపీ సుపరిపాలనకు ఇది నిదర్శనమని ప్రతిపక్ష పార్టీల నాయకులు రెండు నెలలు హర్యానాలో తిష్టవేసి ఎన్నెన్నో వాగ్దానాలు కురిపించి, బీజేపీపై అసత్య ప్రచారాలు చేసినా ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారన్నారు. బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.హరిప్రసాద్, పట్టణ ప్రధాన కార్యదర్శి వీవీ రమణ, జీకే నాగరాజు, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.సూర్యచంద్ర, బీజేవైఎం మండల అధ్యక్షుడు పత్తిపాటి నవీన్‌కుమార్, బీజేపీ పట్టణ కార్యదర్శి సుబ్రమణ్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగాన్ని గౌరవించాలి

రాయచోటిటౌన్, అక్టోబరు 8: తమిళనాడులోని శామ్‌సంగ్ కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలని, కార్మికులు సంఘంతో చర్చించి వేతన ఒప్పందం చేయాలనే నినాదాలతో మంగళవారం రాయచోటి పట్టణంలోని శామ్‌సంగ్ స్టోర్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు మాట్లాడుతూ ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరుతూ తమిళనాడులోని శ్రీపెరంబదూర్ ప్రాంతంలోని సామ్‌సంగ్ పరిశ్రమలో గత నెల రోజుల నుంచి 1500 మంది కార్మికులు నిరవధిక సమ్మె చేస్తున్నారని తెలిపారు. దక్షిణ కొరియాకు చెందిన ఈ సంస్థ భారతదేశంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నప్పుడు భారత రాజ్యాంగాన్ని గౌరవించాలని, రాజ్యాంగం ప్రకారం కార్మికుల హక్కులను గుర్తించాలని, ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచేదాకా ఈ సమ్మె చేసే కార్మికులకు దేశవ్యాప్తంగా మద్దతు తెలియజేస్తామని తెలిపారు. ఈ ధర్నాలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు రాంబాబు, తిరుపాల్, రమణ, నాగమ్మ, రమణమ్మ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కూటమి నేతలు వాగ్దానాలను అమలు చేయాలి


ర్యాలీ నిర్వహిస్తున్న వలంటీర్లు

రాజంపేట టౌన్, అక్టోబరు 8: ఎన్నికలముందు కూటమి నేతలు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో గ్రామ, వార్డు వలంటీర్లు మంగళ వారం మధ్యాహ్నం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కమిషనర్ నాగేశ్వరరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.మహేష్, వలంటీర్ల అసోసియేషన్ నాయకులు సాయి కృష్ణ, కె.గురుస్వామి, మీనా వలంటీర్లకు జగన్ ప్రభుత్వం ఇచ్చే 5 వేల రూపాయలు ఏ మాత్రం చాలదని, తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉద్యోగ భద్రతతో పాటు 10 వేల రూపాయలు వేతనం చెల్లిస్తామని కూటమి నేతలు ప్రచారం చేశారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వలంటీర్లను గాలిలో దీపంలా నిలబెట్టారని, 4 నెలలు గా జీతాలు కూడా చెల్లించలేదన్నారు. వెంటనే కూటమి ప్రభుత్వం వలంటీర్లకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. వెంటనే విధుల్లోకి తీసుకోని పక్షంలో పోరాటాలకు సిద్ధమవుతామన్నారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు హరి, జస్సి, సురేష్, కల్పన, లక్ష్మీదేవి, సుబ్బమ్మ, పవన్, శివశంకర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నైతిక విలువలపై అవగాహన సదస్సు

రాజంపేట, అక్టోబరు 8 : స్థానిక అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.స్వర్ణలత ఆధ్వర్యంలో నైతిక విలువలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయుడు గంగనపల్లె వెంకటరమణ మాట్లాడుతూ సమాజంలో ప్రతిఒక్కరు నిజాయితీ, గౌరవం, క్రమశిక్షణ, కృతజ్ఞత భావాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సామాజిక నైపుణ్యాలను పెంపొందిస్తూ నైతిక నిర్ణయం తీసుకోవడంలో ఈ లక్షణాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు ఎన్ఎస్ఎస్ అధికారి వై.ప్రదీప్‌కుమార్, ఇతర కళాశాలల అధ్యాపక బృందం పాల్గొన్నారు. కళాశాల యాజమాన్యం, కార్యదర్శి గంగిరెడ్డి, కోశాధికారి అభిషేక్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ఛైర్మన్ డాక్టర్ సి.రామచంద్రారెడ్డి అధ్యాపక బృందాన్ని అభినందించారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించాలి

ఒంటిమిట్ట, అక్టోబరు 8 : సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలని మండల వ్యవసాయాధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రజలకు సమాచారం హక్కు చట్టం ద్వారా సమాచారాన్ని నిర్ణీత గడువులో అందించాలని సూచించారు. ప్రభుత్వ శాఖలో ఉన్న సమాచారాన్ని ప్రజలకు ప్రతి విషయాన్ని క్లుప్తంగా అందించాలని సూచించారు. ప్రభుత్వ శాఖల్లో జరిగే పనులు, ప్రజలకు ఉపయోగపడే వివిధ రకాల డాక్యుమెంట్లను సమాచారం చట్టం ద్వారా సులభంగా అందుతాయని, ప్రజలందరూ ఉపయోగించుకోవాలని అన్నారు. స్థానిక కార్యాలయంలో సిబ్బంది, ప్రజలు అడిగిన ప్రతి సమాచారాన్ని సమాచారహక్కు చట్టం ద్వారా అందించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో సోమశేఖర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో శివశంకర్‌రెడ్డి, వ్యవసాయ సిబ్బంది ప్రియదర్శిని, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఎయిర్ ఫోర్స్ డే వేడుకలు

రాయచోటిటౌన్, అక్టోబరు 8: రాయచోటిటౌన్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఇండియన్ ఎయిర్ ఫోర్స్ డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్ వీ. నారాయణరెడ్డి ఆర్థిక సాయంతో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. హాస్పిటల్ సూపరింటెండెంట్ డేవిడ్ సుకుమార్, సీనియర్ వైద్యులు మహేశ్వర్‌రాజు మాట్లాడుతూ ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో పని చేసిన లయన్ వీ. నారాయణరెడ్డి రిటైరైనా తన వంతుగా ప్రజలకు మంచి చేస్తున్నారన్నారు. రాయచోటిటౌన్ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు శివారెడ్డి, జీఎంటీ కోఆర్డినేటర్ పీఎస్ హరినాథరెడ్డి, జోన్ ఛైర్మన్ మహమ్మద్, డిస్ట్రిక్ట్ ఛైర్మన్ వీ. హరీశ్‌చంద్ర, పవన్‌కుమార్ నాయుడు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు అభిషేకం

ఓబులవారిపల్లె, అక్టోబరు 8 : దసరా నవరాత్రుల సందర్భంగా మండలంలోని బొమ్మవరం గ్రామంలో గ్రామదేవతలకు అభిషేకం చేసినట్లు గ్రామ పెద్దలు తెలిపారు. గ్రామ ప్రజల సహకారంతో టీడీపీ యువ నాయకులు ఉమ్మలరాజు సుబ్బరాజు ఆధ్వర్యంలో బొమ్మవరపు అమ్మవారు, ఆరేటి అమ్మవారు దేవాలయాల్లో అభిషేకాలు నిర్వహించి మహిళలకు జాకెట్లు, గాజులు, అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ఉమ్మలరాజు పిచ్చిరాజు, మాజీ సర్పంచ్ నరసింహరాజు, గడ్డం సాంబశివరాజు, శకునాల శివరాజు, సిమెంట్ డీలర్ సుబ్బరాజు, వెంకటరామరాజు, సుబ్బరాజు ప్రజలు పాల్గొన్నారు.

కొత్తకోడూరులో భారీ చోరీ

● 50 తులాల బంగారం, రూ. 50,000లు నగదు అపహరణ



చోరీ జరిగిన ఇంటిలో పరిశీలిస్తున్న పోలీసులు

రైల్వేకోడూరు, అక్టోబరు 8: ఆస్పత్రికి వెళ్లి తిరిగి వచ్చేలోగా ఇంట్లో దొంగలు పడి భారీగా నగలు, నగదు దోచుకెళ్లిన సంఘటన మంగళవారం వెలుగులో కొచ్చి ంది.. బాధితుల కథనం మేరకు.. రైల్వేకోడూరు పంచాయతీ కొత్తకోడూరులోని ఓ ఇంట్లో మాచిరాజు కృష్ణంరాజు, లక్ష్మీదేవి దంపతులు నివాసముంటున్నారు. సోమవారం ఉదయం ఇంటికి తాళం వేసి వైద్య పరీక్షల నిమి త్తం తిరు పతిలోని ఆస్పత్రికి వెళ్లారు. సాయంత్రం తిరిగి వచ్చేసరికి తలుపులకు వేసిన తాళాలు పగులగొట్టి ఉండడం గమనించి, లోపలికి వెళ్లి పరిశీలించగా బీరు వాలో ఉన్న 50 తులాల బంగారు నగలతో పాటు, రూ.50 వేలు నగదు అపహ రణకు గురైనట్లు గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. చోరీకి గురైన బంగారం సుమా రు రూ.40లక్షలు విలువ చేస్తుందని బాధితులు తెలిపారు. జిల్లా నుంచి వేలి ముద్రల నిపుణులతో పాటు, పోలీసు జాగిలం వచ్చి పరిశీలించింది. విష యం తెలుసుకున్న మీడియా పోలీసులను వివరణ కోరగా ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేస్తామని రైల్వేకోడూరు సీఐ హేమసుందర్‌రావు వివరించారు.

ఉరివేసుకొని వివాహిత ఆత్మహత్య



చక్రాయపేట, అక్టోబరు 8: మండలంలోని అద్దాలమర్రి గ్రామానికి చెందిన తాళ్లపల్లె గంగ సుమతి (19) సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాల్లోకెళితే... ఆమె శ్రీసత్యసాయి జిల్లా కదిరి పట్టణం తోల్లపల్లె ప్రశాంత్ అనే వ్యక్తికి 12.4.2024న వివాహమైంది. ఆమె భర్త, అత్త వేధింపులు తాళలేక తన పుట్టింటికి వెళ్లింది. ఆమెతో ఫోన్‌లో ఆమె భర్త, అత్త దుర్భాషలాడటంతో ఆత్మహత్యకు పాల్పడింది. 7.10.2024 సాయంత్రం 4.30 గంటలకు తనపుట్టింట్లో ఉరివేసుకున్నట్లు తెలిపారు. మృతురాలి అన్న గురుభాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చెట్టుకు ఉరివేసుకొని యువకుడు..



చక్రాయపేట, అక్టోబరు 8: మండలంలోని కె.ఎర్రగుడి గ్రామం బీఎన్‌తాండాలో సమీపంలోని చెట్టుకు ఉరివేసుకొని కార్తీక్‌నాయక్ (19) అనే యువకుడు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఆదివారం నుంచి కనిపించకుండా పోయాడని, పలు ప్రాంతాలలో వెతుకులాడామన్నారు. మంగళవారం కాలేటివాగు సమీపంలో చెట్టుకు ఉరివేసుకున్నట్లు పేర్కొన్నారు. మృతుడి తండ్రి క్రిష్ణానాయక్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

బాలుడి అదృశ్యం.. కేసు నమోదు



పెనగలూరు, అక్టోబరు 8 : తన మనుమడు బసిరెడ్డి కార్తీక్‌రెడ్డి (10) రెండు రోజులుగా కనిపించడం లేదంటూ మండలంలోని సత్తుపల్లెకు చెందిన బసిరెడ్డి సుబ్బలక్షుమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.రవిప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 6న సాయంత్రం 7 గంటల సమయంలో పానీపూరీ తినేందుకని బాలుడు ఇంటి నుంచి వెళ్లాడు. అయితే ఎంతకూ బాలుడు తిరిగిరాకపోవడంతో ఆమె చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికారు. ఫలితం లేకపోవడంతో స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. తప్పిపోయిన బాలుడు చారల టీషర్టు ధరించి ఉన్నాడని, ఐదో తరగతి చదువుతూ తెలుగు మాత్రమే మాట్లాడతాడని తెలిపారు. బాలుడి ఆచూకి తెలిస్తే సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

పోలీసుల అదుపులో దొంగ

● బంగారు నగలు స్వాధీనం

కడప (క్రైం), అక్టోబరు 8 : కడప నగరంలో ఇళ్లలో దూరి చోరీకి పాల్పడుతున్న ఓ దొంగను చిన్నచౌకు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఓంశాంతినగర్‌లో ఓ వృద్ధురాలి ఇంట్లోకి చొరబడి బంగారు నగలు ఉన్న బ్యాగును అపహరించాడు. అలాగే నకాష్‌లో ఓ ఇంట్లో చొరబడి బంగారు నగలు చోరీ చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. నేడో రేపు యువకుడిని అరెస్టు చూపించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

టపాకాయల దుకాణాలు సీజ్

రాజంపేట టౌన్, అక్టోబరు 8: పట్టణంలోని టపాకాయలు విక్రయించే రెండు దుకాణాలను సీజ్ చేసినట్లు సీఐ యల్లమరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా టపాసులు అమ్ముతున్నట్లు తెలిస్తే వారిపై చర్యలు తప్పవని సీఐ తెలిపారు. పట్టణంలో బండ్రాళ్ల వీధిలో అనుమతులు లేకుండా టపాసులు విక్రయిస్తున్నారని సమాచారం అందడంతో ఆ దుకాణాలను పరిశీలించామన్నారు. అనుమతులు లేకపోవడంతో వారివద్ద ఉన్న ఆరు లక్షల రూపాయల సామగ్రిని సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

నీటిలో మునిగి విద్యార్థి మృతి



కొట్టం సుజిత్ (ఫైల్)

మైదుకూరు రూరల్, అక్టోబరు 8: మైదుకూరు మండలంలోని విశ్వనాథ పురం ఎస్టీ కాలనీకి చెందిన కొట్టం సుజీత్ (13) గోడేరు వంకలో మునిగి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. వివరాల్లోకి వెళితే... విశ్వనాథపురం ఎస్టీ కాలనీకి చెందిన కొట్టం రామదస్తగిరమ్మ, కొట్టం సుదర్శన్ దంపతులకు ఇద్దరు పిల్లలు. పెద్ద కుమారుడు కూలి పనిచేసుకుంటున్నాడు. చిన్నకుమారుడు సుజీత్ శెట్టివారిపల్లె హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి చదు వుతున్నాడు. దసరా పండుగ సెలవులు కావడంతో ఇంటి వద్దనే ఉన్నాడు. మంగళవారం సుజీత్ తండ్రి సుదర్శన్‌తో కలసి గేదెలు మేపుకునేందుకు వెళ్లాడు. సుదర్శన్ మధ్యాహ్నం ఇంటికి పోయి అన్నం తిని వస్తానని.. గేదెలకు కాపలా ఉండాలని కొడుకుకు చెప్పి వెళ్లాడు. ఆ సమయంలో గేదెలు గోడేరు వంకలోకి నీళ్ల కోసం దిగాయి. వాటితో పాటు సుజీత్ కూడా నీటిలో దిగి బురదలో కూరుకుపోయి మరణించి ఉంటాడని స్థానికులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆవుల దొంగలు అరెస్టు

పీలేరు, అక్టోబరు 8: కేవీపల్లె మండలంలో గత కొన్ని రోజులుగా కలకలం రేపిన ఆవుల దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. కేవీపల్లె ఏఎస్ఐ పీజీ లక్ష్మీదేవి కథనం మేరకు. లక్ష్మిరెడ్డిగారిపల్లెకు చెందిన ఎస్.ఖాజా ఇటీవల మండలంలోని మూడు ఆవులను దొంగలించి వాటిని అమ్మి సొమ్ము చేసుకున్నాడు. పీలేరు పట్టణం కట్టుకాలువ వీధికి చెందిన అతని బంధువు ఎస్.సలీనా ఈ అమ్మకాల్లో అతనికి సహకరించింది. పాడిరైతుల ఫిర్యాదుల మేరకు పోలీసులు మంగళవారం ఖాజా, ఎస్.సలీనాలను అరెస్టు చేశారు.

పొట్టకూటి కోసం వెళితే..

ప్రాణం తీసేశారు

● ఎడారికి తీసుకెళ్లి దారుణ హత్య

● కువైత్‌లో మృతదేహం..

ఇండియాలో బంధువుల ఎదురుచూపు



భార్యతో మృతుడు వీరాంజినేయులు (ఫైల్‌ఫొటో)

సుండుపల్లి, అక్టోబరు 8: ఓ వైపు కరువు మరోవైపు ఇద్దరు బిడ్డల ఆకలి కేకలు చూడలేక 10 సంవత్సరాల క్రితం కువైత్‌కు వెళ్లిన అన్నమయ్య జిల్లా సుండుపల్లి మండలానికి చెందిన కంప వీరాంజినేయులు(45) ఎడారిలో శవమై తేలాడు. మృతదేహాన్ని సొంతూరికి రప్పించాలని మృతుడి కుమారులు, బంధువులు కోరుతున్నారు. బాధితుల కథనం మేరకు.. సుండుపల్లి మండలం సొంతంవారిపల్లి గ్రామపంచాయతి ఎరికలబిడారుకు చెందిన కప్పం వీరాంజినేయులు, కప్పం చెన్నకేశవులమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. వీరు కూలిపనులతో జీవనం సాగించేవారు. కరువుతో ఊర్లో కూలిపనులు కూడా సక్రమంగా లేకపోవడంతో 10 సంవత్సరాల క్రితం వీరాంజినేయులు కువైత్ వెళ్లాడు. పిల్లలు పెరుగుతుండటంతో అక్కడి సంపాదన కూడా బొటాబొటిగా సరిపోయేది. దీంతో నాలుగేళ్ల క్రితం భార్యను కూడా కువైత్ పిలిపించుకున్నాడు. ఇద్దరూ అక్కడ ఓ సేట్ ఇంట్లో పనిచేసేవారు. అంతా సాఫీగా సాగిపోతోంది అనుకుంటున్న సమయంలో వారు ఉంటున్న యాజమాని కొడుకుతో కొన్నిరోజుల క్రితం మాటమాట పెరిగి వీరాంజినేయులు గొడవపడ్డాడు. ఈ నేపథ్యంలో ఈనెల 4వ తేదీన వీరాంజినేయులును యజమాని ఇంట్లోనుంచి బయటకు తీసుకెళ్లాడు. తిరిగి అతను ఇంటికి రాకపోవడంతో తన భర్త ఎక్కడంటూ చెన్నకేశవులమ్మ ప్రశ్నించారు. దీంతో ఆమెను కువైత్‌లోనే మరో ఇంటికి బదిలీ చేశారు. ఆమెకు అనుమానం వచ్చి తన భర్త ఇంటికి రాలేదని అక్కడ తెలిసిన వారికి చెప్పి విచారించగా ఒక మృతదేహం మార్చురీలో ఉందని గుర్తించారు. ఆ మృతదేహం ఎడారి ప్రాంతంలో లభ్యమైనట్లు సమాచారం రావడంతో పోలీసులు వెళ్లి తీసుకొచ్చి మార్చురీలో ఉంచారు. పోలీసుల విచారణలో ఆ మృతదేహం వీరాంజినేయులుదిగా తేలింది. అక్కడి అంతర్గత వ్యవహారాల మంత్రిత్వశాఖ ఈ వ్యవహారాన్ని వెలుగులోకి తీసుకురావడంతో నిందితుడిని అరెస్టు చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఇండియాలోని కుటుంబీకులు, బంధువులు తల్లడిల్లిపోతున్నారు. కాగా.. మృతుడి పెద్దకొడుకు విష్ణువర్ధన్ ఇంటర్మీడియట్, చిన్నకొడుకు గోవర్ధన్ 9వ తరగతి చదువుతున్నారు. తాము చదువుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆశించి కువైత్‌కు వెళ్లిన తండ్రి శవమయ్యాడని తెలియడంతో వారిద్దరూ భోరున విలపిస్తున్నారు. కలెక్టర్, ఎస్పీ చొరవ చూపి తమ తండ్రి మృతదేహాన్ని స్వస్థలానికి రప్పించాలని విన్నవించుకున్నారు.

భద్రతా ప్రమాణాలతో పైప్‌లైన్ పనులు చేపట్టాలి

● కలెక్టర్ శివశంకర్

కడప(కలెక్టరేట్), అక్టోబరు 8: పర్యావరణానికి, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల భద్రతా ప్రమాణాలు పాటిస్తూ పైప్‌లైన్, కేబుల్ నిర్మాణ పనులు చేపట్టాలని కలెక్టర్ శివశంకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌తో కలసి హెచ్‌పీసీఎల్ పైపులైన్, కేబుల్ నిర్మాణ ప్రక్రియలో భాగస్వామ్యం వహించే అనుబంధ శాఖల ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ విజయవాడ-ధర్మపురి పైపులైన్ నిర్మాణం జిల్లా మీదుగా వెళుతోందన్నారు. ప్రతి 30-40 కి.మీ మధ్యలో ఒక వాల్వ్ ఏర్పాటు చేస్తున్నారన్నారు. జిల్లాలోనే 140 కి.మీ జియో ఫినిషింగ్ ద్వారా నిర్మాణ పనులు జరుగుతాయన్నారు. ఆయా మండలాల్లో అన్ని రకాల అనుమతులు తీసుకోవడంతో పాటు అన్ని రకాల భద్రతా చర్యలు చేపట్టామన్నారు. అలాగే ఏపీ ఫైబర్ నెట్, ఎయిర్ ఫైబర్ కేబుల్ నిర్మాణం పనులు జిల్లాలో ఇప్పటికే పూర్తయ్యాయన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహిస్తాం

సాగు నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తామని కలెక్టర్ లోతేటి శివశంకర్ రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామనాయుడుకు నివేదించారు. రాష్ట్రంలోని సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు నిర్వహించే ప్రక్రియపై మంగళవారం విజయవాడ నుంచి జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, డీఆర్వో గంగాధర్ గౌడ్, జవనరుల శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం జిల్లా పరిధిలో 206 పెద్ద, మధ్య, చిన్న తరహా నీటి సంఘాలు ఉన్నాయన్నారు. ఎలాంటి లోటు పాట్లు లేకుండా ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జలవనరుల శాఖ ఎస్ఈలు మల్లికార్జున రెడ్డి, వెంకట్రామయ్య పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలు పటిష్టంగా నిర్వహిస్తాం : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), అక్టోబరు 8: జిల్లాలోని 164 నీటి వినియోగదారుల సంఘాలకు పటిష్టంగా ఎన్నికలు నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ రాష్ట్ర జలవనరుల అభివృద్ధిశాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు వివరించారు. మంగళవారం విజయవాడ నుంచి నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల అంశంపై జిల్లా కలెక్టర్లు, జలవనరులశాఖ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా పరిధిలో పెద్ద, మధ్య తరహా నీటి వినియోగ దారుల సంఘాలు లేవని, చిన్న నీటిపారుదల కింద 164 సంఘాలు ఉన్నట్లు తెలిపారు. ఇందులో 94 సంఘాలు ఉమ్మడి కడప జిల్లా, 70 సంఘాలు ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఉన్నట్లు వివరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో నీటి పారుదల రంగానికి ముఖ్యమంత్రి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని, నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. అక్టోబరు 16 నుంచి నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికల ప్రక్రియ మొదలు అవుతుందని, ఇందుకు సంబంధించిన షెడ్యూలు, నామినేషన్‌పత్రాలను కలెక్టరేట్లకు పంపుతామన్నారు. షెడ్యూల్ విడుదల చేసిన తర్వాత రోజువారీ కార్యక్రమాలను పక్కాగా అమలు చేయాలన్నారు. నీటి వినియోగదారుల సంఘానికి 6 మంది ప్రాదేశిక సభ్యులను ఎన్నుకోవాలని, వారి నుంచి అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎంపిక చేసుకోవాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు డీఆర్వో సత్యనారాయణరావు, ఆర్డీవో రంగస్వామి, జలవ నరులశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు 35 శాతం ఐఆర్ ప్రకటించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు

కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 8 :రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు 12వ పీఆర్సీ అమలు అయ్యేంతవరకు 35శాతం ఐఆర్‌ను ప్రకటించాలని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రామాంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్టీఎఫ్ కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం నియమించిన మన్మోహన్ సింగ్ కమిషన్ బాధ్యతల నుంచి వైదొలగినందున సీఆర్సీ అమలులో మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం 35శాతం ఐఆర్ ప్రకటించాలని, సీఆర్సీ నూతన కమిషన్‌ను నియమించాలని కోరారు. 11వ పీఆర్సీలో మెరుగైన ఫిట్‌మెంట్ ప్రకటించాలని కోరారు. ఈ నెల 10వ తేదీన జరుగుతున్న రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో ఈ విషయాలు చర్చించి దసరా కానుకగా పెండింగులో ఉన్న రెండు డీఏలను ఐఆర్‌ను విడుదల చేయాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వెంకటసుబ్బయ్య, జిల్లాగౌరవ అధ్యక్షుడు శ్రీనివాసులు, అన్నమయ్య జిల్లా గౌరవాధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రాజగోపాలరెడ్డి, నాయకులు క్రిష్టఫర్ జాన్, ఎ.ప్రసాద్, రవిశంకర్, రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

గొర్రెల పెంపకందారుల అభివృద్ధికి పటిష్ట చర్యలు

● తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలి ● సర్వసభ్య సమావేశంలో చైర్మన్ చిన్నమల్లయ్య



మాట్లాడుతున్న గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ జిల్లా చైర్మన్ నాగమల్లేశ్వరయ్య

కడప రూరల్, అక్టోబరు 8 : జిల్లాలో గొర్రెలు, మేకల పెంపకందారుల అభివృద్ధికి తెలుగుదేశం ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపడుతోందని గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ జిల్లా చైర్మన్ అన్నం నాగమల్లేశ్వరయ్య పేర్కొన్నారు. మంగళవారం ఊటుకూరులోని పశుసంవర్ధక శాఖ సమావేశ మందిరంలో గొర్రెలు, మేకల పెంపకందారుల సహకార యూనియన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి సారథ్యంలోని టీడీపీ కూటమి ప్రభుత్వం గొర్రెల పెంపకానికి ప్రాధాన్యతను కల్పిస్తోందన్నారు. పెంపకందారులకు 20 శాతం వడ్డీతో రుణాలను అందిస్తోందన్నారు. రుణాలను సకాంలో చెల్లించినప్పుడే వారు తిరిగి కొత్త రుణాలను పొందవచ్చన్నారు. జిల్లాలో దాదాపు 130 వరకు సొసైటీలు ఉన్నాయని, వీటిలో చాలా వరకు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించడం లేదన్నారు. నిబంధనల ప్రకారం నడుచుకోకపోతే నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు రూ.40 లక్షల వరకు రుణాలు వసూలు కావాల్సి ఉందన్నారు. వీటిని త్వరగా చెల్లించి కొత్త రుణాలను తిరిగి పొందడానికి వీలుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఏడీ రమణారెడ్డి, గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ అధ్యక్షుడు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసగాళ్ల ఉచ్చులో వైద్యుడు

● రూ.2 కోట్ల 19 లక్షలు సమర్పయామి

(రాయచోటి- ఆంధ్రజ్యోతి): సైబర్ మోసగాళ్ల ఉచ్చుకు రాయచోటి పట్టణంలోని ఓ ప్రముఖ వైద్యుడు చిక్కుకున్నాడు. తాము సీబీఐ అధికారులమని, మీ పేరు మీద డ్రగ్స్ , విదేశీ కరెన్సీ పార్సిల్ వచ్చిందని, మీపై కేసే నమోదు చేసి అరెస్ట్ చేస్తామని బెదిరించారు. వాళ్ల బెదిరింపులకు భయపడ్డ డాక్టర్ రూ.2 కోట్ల 19 లక్షలు సమర్పించుకున్నాడు. తర్వాత తాను మోసపాయానని తెలుసుకుని జిల్లా సైబర్ పోలీసులను ఆశ్రయించాడు. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని ప్రముఖ చిన్న పిల్లల వైద్యుడు ఇంతియాజ్ అలీకి జూలై 7న 9321770438 నెంబరు నుంచి ఓ వ్యక్తి ఫోన్ చేసి తాము సీబీఐ అధికారులమని, ముంబై నుంచి ఫోన్ చేస్తున్నట్లు తెలిపారు. మీ పేరు మీద డ్రగ్స్, విదేశీ కరెన్సీ పార్శిళ్లు వస్తున్నాయని, దీంతో కేసు నమోదైందని, ఈ కేసులో మీతోపాటు మీ కుటుంబ సభ్యులను అరెస్టు చేస్తామని బెదిరించారు. దీంతో, డాక్టర్ ఆయన కుటుంబ సభ్యులు భయపడ్డారు. కేసు లేకుండా చేసేందుకు డబ్బు ఇవ్వాలని చెప్పడంతో మోసపోయిన డాక్టర్ ఇప్పటి వరకూ విడత లవారీగా రూ.2,19,11,273లు ఆన్‌లైన్‌లో చెల్లించారు. అయినా బెదిరింపులు ఆగకపోవ డంతో అనుమానించి ఈ నెల 4న జిల్లా సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు రాయచోటి అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇటువంటి ఫేక్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

కేబుల్ వైర్ల చోరీ

బి.కొత్తకోట, అక్టోబరు 8: మండలంలోని అచ్చమ్మకోట గ్రామ పరిసరాలలో వ్యవసాయ మోటర్లకు అమర్చిన కేబుల్ వైర్లు చోరీ అయినట్లు బాధిత రైతులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాగునీటి పథకం బోరుకు సంబంధించిన దాదాపు 70 మీటర్ల కేబుల్ వైర్లతో పాటు స్థానిక రైతులు అమరనాథరెడ్డి, సుధాకర్‌రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, శ్రీనాథరెడ్డిల వ్యవసాయ బోర్ల వద్ద కూడా కేబుల్ వైర్లను కత్తిరించుకు వెళ్లారని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దంపతుల అదృశ్యం

పీలేరు, అక్టోబరు 8: కేవీపల్లె మండలం చింత మాకులపల్లెకు చెందిన పి.రెడ్డిశేఖర్(38), తన భార్య దీప(30) అదృశ్యంపై మంగళవారం పీలేరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెడ్డిశేఖర్ తండ్రి రెడ్డప్ప నాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఆచూకీ కోసం దర్యాప్తు చేస్తున్నారు.

24 మంది బైండోవర్

బి.కొత్తకోట, అక్టోబరు 8: బి.కొత్తకోటలో 24 మందిని పోలీసులు డిప్యూటీ తహసీల్దారు మహమ్మద్ అన్సారీ ఎదుట హాజరు పరచి బైండోవర్ చేశారు. వినాయక చవితి వేడుకలలో భాగంగా డాన్సులు వేసి రెచ్చగొట్టారన్న అభియోగంపై బైండోవర్ చేశారు.

ముంబైలో అదృశ్యం.. కడపలో ప్రత్యక్షం

● ఆరేళ్ల తర్వాత తల్లిదండ్రులకు చెంతకు



బాలున్ని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న జువైనల్ అధికారులు

కడప (క్రైం), అక్టోబరు 8: ముంబైలో ఆరేళ్ల క్రితం తప్పిపోయిన బాలుడు నాలుగేళ్ల తర్వాత కర్నూలులో ప్రత్యక్షమయ్యాడు. అక్కడి నుంచి కడప జువైనల్ హోంకు వచ్చాడు. ఎట్టకేలకు ఆధార్ ద్వారా బాలుడి ఆచూకీ కనిపెట్టి అతడిని తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలు ఇలా.. ముంబైకి చెందిన దుర్గాదాస్, లక్ష్మి దంపతులకు ముగ్గురు పిల్లలు. వీరి రెండో కుమారుడైన అత్వార్‌కు ప్రస్తుతం 14 సంవత్సరాలు. ఈ బాలుడు 2018లో తప్పిపోయాడు. అనంతరం ఎక్కడెక్కడో తిరిగి 2022కు కర్నూలు చేరుకు న్నాడు. గుర్తించిన అధికారులు అతడిని కర్నూలు జువైనల్‌కు తరలించారు. అక్కడి నుంచి ఇటీవల కడపకు తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో బాలుడి పూర్తి వివరాలు తెలియకపోవడంతో జువైనల్ హోం పర్యవేక్షణ అధికారి వీరయ్య బాలుడికి ఆధార్ కోసం దరఖాస్తు చేశారు. అయితే అప్పటికి బాలుడి పేరుతో ఆధార్ ఉంది. దీని ఆధారంగా బాలుడి తల్లిదండ్రులను గుర్తించారు. మంగళవారం కడపకు వారి తల్లిదండ్రులను పిలిపించి బాలున్ని అప్పగించారు. ఆరేళ్ల తరువాత తమ కుమారుడిని చూసిన తల్లిదండ్రులు కన్నీరుగార్చారు.

నిత్యాన్నదాన పథకానికి రూ. లక్ష వితరణ



నిత్యాన్నదాన పథకానికి విరాళం అందిస్తున్న దాతలు

చక్రాయపేట, అక్టోబరు 8: గండి క్షేత్రంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి దువ్వూరు మండలం భీమునిపాడు గ్రామంలో ఉంటున్న కుప్పన్నగారి సంజీవరెడ్డి కుమారుడు రామాంజనేయరెడ్డి కుటుంబ సభ్యులు శనివారం రూ.1,00,116 చెక్కు విరాళం ఇచ్చారు. రామాంజనేయరెడ్డి గతంలో కూడా గండి అభివృద్ధి కార్యక్రమాలకు విరాళాలు ఇచ్చారన్నారు. వీరికి ప్రధాన అర్చకులు కేసరి, వేదపండితులు రామ్మోహన్ శర్మ ప్రత్యేక దర్శనం చేయించి శాలువాలు కప్పి సత్కరించారు.కాగా వీరు గతంలో కూడా రూ.2,00,232 విరాళంగా ఇచ్చారు. వీటితో పాటు ఆలయంలో జరిగిన షెడ్డు నిర్మాణానికి కూడా ఇచ్చారని తెలిపారు. చెక్కును సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, ప్రధాన అర్చకుడు కేసరికి అందించారు.

అన్నమయ్య జిల్లా సర్వే శాఖ ఏడీగా భరత్‌కుమార్



రాయచోటి(కలెక్టరేట్), అక్టోబరు8: అన్నమయ్య జిల్లా ల్యాండ్ అండ్ సర్వేశాఖ ఏడీగా భరత్‌కుమార్ నియమితులయ్యారు. నెల్లూరుకు చెందిన ఈయనను సాధారణ రిక్రూట్మెంట్‌లో అన్నమయ్య జిల్లాకు కేటాయించినట్లు అధికారులు తెలిపారు. ఇక్కడ ఉన్న ఏడీ జయరాజు చిత్తూరుకు బదిలీపై వెళ్లిపోయారు.

అలంకరణలతో అలరిస్తున్న అమ్మవారు


శాకాంబరిగా అమ్మవారు మదనపల్లె


గాజుల అలంకరణలో మాతమ్మ, నిమ్మనపల్లె


సంతోషిమాతగా వాసవీమాత కురబలకోట


చండీ దేవి అలంకారంలో ఎల్లమ్మ, పీలేరు


మహాలక్ష్మి అవతారంలో కలికిరి ఎల్లమ్మ


ములకలచెరువులో అలంకరణలో అమ్మవారు


కాళీమాత అలంకారంలో అమ్మవారు, తంబళ్లపల్లె

మదనపల్లె అర్బన్, అక్టోబరు8: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరోరోజు మంగళవారం మదనపల్లె పట్టణంలోని వాసవీభవన్ వీధిలో వాసవీ కన్యాకాపరమేశ్వరీ అమ్మవారు సంతానలక్ష్మీగా భక్తులను కటాక్షించారు. కోర్టులో వెలసిన గంగమ్మ దేవత శాకాంబరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని ఆలయంలో చీర, జాకెట్లు, పసుపు, కుంకుమలతో తరలి వచ్చి అమ్మకు సమర్పించారు. నీరుగట్టువారిపల్లెలోని చౌడేశ్వరీదేవి ఆలయంలో శాకాంబరీగానూ, దేవతానగర్‌లోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు సంతానలక్ష్మీగా భక్తులకు దర్శనమిచ్చరు. దేవళంవీధిలోని సోమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు లలితత్రిపురసుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో అమ్మవారిని మహాలక్ష్మీగా అలంకరించి భక్తులకు దర్శభాగ్యం కల్పించారు. పట్టణంలోని అనపగుట్టలో ఉన్న అభయలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో లక్ష్మీనరసంహుడికి కుంకుమ అలంకరణతో పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు పూజల్లో పాల్గొన్నారు.

నిమ్మనపలిలో: దసరా నవరాత్రులు సందర్భంగా నిమ్మనపల్లి పంచాయతి పెద్దమాదిగపల్లి వెలసిన మాతమ్మతల్లి ఆలయంలో ఐదవరోజు అమ్మవారు గాజుల అంకరణలో భక్తులకుదర్శనమించ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదానం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.

కురబలకోటలో: దసరాశరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా కురబలకోటలోని కన్యకాపరమేశ్వరీ అమ్మవారు సంతోషిమాతదేవీ అలంకరణలో మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

ములకలచెరువులో: స్థానిక పీటీఎం రోడ్డులో వెలసిన వాసవి కన్యాకాపరమేశ్వరి దేవి అమ్మవారు మంగళవారం నాగదేవత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషే కాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

తంబళ్లపల్లెలో: తంబళ్లపల్లె మండల కేంద్రంలోని శివాలయంలో కొలువుదీరిన పార్వతీదేవి అమ్మవారు మంగళవారం కాళీ మాత అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దసరా నవరాత్రి ఉత్సవాలల్లో బాగంగా భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.


లలితాత్రిపుర సుందరిగా రెడ్డెమ్మ తల్లి, గుర్రంకొండ


మహాలక్ష్మీదేవిగా సత్యమ్మతల్లి వాల్మీకిపురం


లలితాత్రిపుర సుందరిగా కలకడ అమ్మవారు

పీలేరులో: దసరా శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పీలేరు నెహ్రూబజారులోని కన్యకాపరమేశ్వరి అమ్మవారు రాజరాజే శ్వరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మోడల్ కాలనీ వద్దనున్న ఎల్లమ్మ, ఇందిరమ్మ కాలనీ వద్దనున్న దిన్నెగంగమ్మలు చండీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. పీలేరు గ్రామదేవత అయిన రౌద్రాల అంకాళమ్మ లలితాదేవిగా దర్శనమిచ్చారు. ఆలయాల నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

గుర్రంకొండలో: గుర్రంకొండ మండలం చెర్లోపల్లె రెడ్డెమ్మ అమ్మవారు మంగళవారం లలితా త్రిపుర సుందరి దేవిగా భక్తులను కనువిందు చేశారు. అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ఉదయాన్నే అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అమ్మవారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. కార్యక్రమంలో ఈవో మంజుల, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కలకడలో: మండలంలోని కోన చౌడేశ్వరి అమ్మవారు మంగళవారం మహాలక్ష్మీ దేవిగా భక్తులను కటాక్షించారు. అమ్మవారి దసరా ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు.

వాల్మీకిపురంలో: దసరా శరన్నవరాత్రి వేడుకలలో భాగంగా మంగళవారం వాల్మీకిపురం మండలం వ్యాప్తంగా అమ్మవారి దేవాలయాలలో భక్తుల సందడి వాతావరణం నెలకొంది. మండలంలోని గండబోయనపల్లె గ్రామంలో వెలసిన సత్యమ్మతల్లి అమ్మవారు, వాల్మీకిపురం నల్లవీరగంగాభవానీ అమ్మవారు, గొల్లపల్లెలోని విరూపాక్షమ్మ తల్లి మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే కోనేటివీధిలోని శివాలయంలో లక్ష్మీకామేశ్వరి అమ్మవారికి దుర్గాదేవిగాను, చింతపర్తి వాసవీ అమ్మవారి ఆలయం, స్థానిక బజారువీధిలోని కన్యకాపరమేశ్వరి దేవి ఆలయాలలో రాజరాజేశ్వరిదేవిగా భక్తులను కటాక్షించారు.

పెద్దతిప్పసముద్రంలో: పీటీఎంలో వెలసిన పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మంగళవారం పార్వతీ అమ్మవారిని గవ్వలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలతో సహాటు అన్నదానం నిర్వహించారు.

కలికిరిలో: దసరా శరన్నవరాత్రుల సందర్భంగా కలికిరిలో స్థానిక గ్రామ దేవత ఎల్లమ్మ మంగళవారం మహాలక్ష్మీదేవి అవతారంలో భక్తులకు సాక్షాత్కరించారు. అమ్మవారిని మహాలక్ష్మి రూపంలో అద్భుతంగా తీర్చిదిద్దారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

నిరాదరణ బాధితులకు ఆశ్రయం..

సర్వోదయ వృద్ధాశ్రమం



- వృద్ధుల సేవలో తరిస్తున్న యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్
- 30 ఏళ్లుగా లాభాపేక్ష లేని సేవాశ్రమం
- జిల్లా నలుమూలల నుంచి సేద తీరుతున్న వృద్ధులు


ప్రతి వారం పరీక్షలు చేస్తున్న వైద్య బృందం


కలికిరి సర్వోదయ వృద్ధాశ్రమం


సామూహిక భోజనశాల

కలికిరి, అక్టోబరు 8: కన్న బిడ్డల నిరాదరణకు గురై కాస్త కడుపు నింపుకోవడానికి పరాయి పంచన బతుకులీడ్చే వయోవృద్ధులనగానే శ్రీశ్రీ 'భిక్షు వర్షీయసి' గుర్తుకు రాక మానదు. వందేళ్ల క్రితమే ఇప్పటి వర్తమాన సమాజాన్ని ఒడిసి పట్టి రాబోయే కాలాన్ని వీక్షించిన ఆయన అప్పటి అంచనాలు పునర్ముద్రితంలా కనపడుతున్నాయి. నిరాశ్రయులైన వయో వృద్ధుల పరిస్థితి ఇంతకంటే భిన్నంగా ఉండదని ఈ గేయం ఎప్పుడో తేల్చి చెప్పింది. ఇలాంటి వారిని ఆదరించేందుకు అక్కడక్కడా వృద్ధాశ్రమాలకు అంకురార్పణ జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే కలికిరి సమీపంలోని సర్వోదయ వృద్ధాశ్రమం అనేకమంది అన్నార్తులు, తిరస్కృతులకు ఆశ్రయం కల్పిస్తోంది. మండలంలోని పత్తేగడ పంచాయతీ కొర్లకుంట గ్రామ నివాసి ఆదినారాయణరెడ్డి 1994 లో మదనపల్లె-తిరుపతి హైవే పక్కన తనకున్న సొంత పొలంలో వృద్ధాశ్రమాన్ని నిర్మించి అన్నీ ఉన్నా అనాథలుగా మారిన వారికి ఓదార్పునిస్తున్నారు. రెండున్నర దశాబ్దాలపాటు తిరుపతి శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేసి అనంతరం కుప్పం ద్రవిడ వర్సిటీ రిజిస్ట్రారుగా కూడా పనిచేసిన ఆదినారాయణరెడ్డి ఎలాంటి ప్రచార ఆర్భాటానికి ఇష్టపడక ఓ యజ్ఞం లా, తపస్సులా అత్యంత ఓర్పుతో ఈ పనిని నిర్వర్తించడంలో నిమగ్నమయ్యారు.


వృద్ధులు పడుకునే గది (అటాచ్‌డ్ బాత్ రూములతో)

చుట్టూ పచ్చదనం మధ్య వృద్ధాశ్రమం

సర్వోదయ వృద్ధాశ్రమం రెండెకరాల విస్తీర్ణంలో అత్యంత పచ్చదనం మధ్య ప్రణాళిక ప్రకారం రూపుదిద్దుకొంది. ఈ సహజసిద్ధ ప్రకృతే వయోవృద్ధులకు అత్యంత విరామం కల్పించేదిగా ఉంది. 1994లో కేవలం ఐదారుమంది వృద్ధులకు ఆశ్రయం కల్పిస్తూ ప్రారంభించగా ప్రస్తుతం 26 మందికి చేరుకుంది. మరీ ఎక్కువగా ఉంటే వృద్ధులకు చికాకుగా ఉంటుందనే ఉద్దేశంతో కలికిరి పట్టణంలో రెడ్డివారిపల్లెలో మరో ఆశ్రమాన్ని ఏర్పరచారు. కొర్లకుంట వృద్ధాశ్రమంలో శాశ్వతంగా పదేళ్ల నుంచి దాదాపు 15 మంది కొనసాగుతున్నారు. అన్నమయ్యతో పాటు ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి చాలా మంది వృద్ధులు ఇక్కడ ఆదరణ పొందుతున్నారు. పుంగనూరు, బంగారుపాలెం, చిత్తూరు, నిమ్మనపల్లె, చిన్నగొట్టిగల్లు, కల్లూరు, సదుం, వాయల్పాడు, దేవపట్ల, బళ్లారి (కర్నాటక), వెదురుకుప్పం, కలకడ తదితర ప్రాంతాల నుంచి వచ్చి చేరిన వారితో రెండు ఆశ్రమాలు నిండిపోయాయి. అందరికీ సరిపడా అన్ని రకాల ఆధునిక వసతులు వాషింగ్ మెషీన్లు, రిఫ్రిజిరేటర్లు, సోలార్ వేడినీళ్లు, ఆర్వో వాటర్ ప్లాంటు, టీవీలు అందుబాటులో ఉన్నాయి. ప్రతి బుధవారం ఒక వైద్యుడు సిబ్బందితో వచ్చి వృద్ధులందరికీ ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారు. ప్రతి ఆదివారం పీలేరు నుంచి యోగా మాస్టారు వచ్చి యోగా శిక్షణ ఇస్తున్నారు. వాళ్లంతకు వాళ్ల ఇష్టపడితేనే కూరగాయలు తరగడం, చెట్లకు నీళ్ల పట్టడం వంటి పనులకు అనుమతిస్తారు. ప్రతి గదికీ అటాచ్‌డ్ బాత్ రూములున్నాయి.

బయట తిండికి అనుమతి లేదు

ప్రారంభంలో పెళ్లిళ్లు, పుట్టిన రోజుల్లాంటి ప్రత్యేక కార్యక్రమాలు జరుపుకునే వారు వివిధ రకాల వం టలను పంపితే అనుమతించేవారు. అయితే కరోనా తరువాత వీటన్నింటినీ నిషేధించారు. అయితే వంట సరుకులు, కూరగాయలు అందజేస్తే అక్కడే వండించి పెట్టే ఏర్పా టు చేశారు. సమీపంలో ఐటీబీపీ, బీఎస్‌ఎఫ్, సీఆర్పీఎఫ్‌లాంటి సంస్థలు తరచూ ఈ వృద్ధాశ్రమంలో ఏదో ఒక సేవా కార్యక్రమాన్ని నిర్వహించడం దీనికి కలిసొచ్చింది. అంతేగాకుండా అక్కడున్న వృద్ధులను దీపావళి, దసరా, ఇతర విశేష రోజుల్లో వాహనాల్లో తమ స్థావరాలకు తీసుకెళ్లి రోజంతా వారిని ఉల్లాసపరిచి తిరిగి సాయంకాలానికి ఆశ్రమానికి చేర్చడం కూడా ఆనవాయితీగా ఉంది. తరచూ బయట నుంచి వచ్చే ఈ సంస్థలకు చెంది న ఉన్నతాధికారులు కుటుంబాలతో కలిసి వృద్ధాశ్రమాన్ని సందర్శించడం పరిపాటిగా ఉంది.

నెల చివరి రోజు ఖాళీ ..

ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా సెప్టెంబరు 30 వతేదీన వృద్ధాశ్రమాన్ని సందర్శించిన ఆంధ్రజ్యోతికి ఒక విచిత్రమైన ఆనవాయితీ ఎదురైంది. అక్కడికెళ్లే సరికి వృద్ధులంతా కూడబలుక్కున్నట్లు ప్రయాణమై ఎదురొచ్చారు. విశేషం ఏమిటని ఆరా తీస్తే ప్రతి నెలా చివరి రోజు ప్రభుత్వం అందజేసే పింఛన్లు తీసుకోవడానికి సొంత ఊళ్లకు వెళ్లడం మరుసటిరోజు పింఛను తీసుకున్న వెంటనే సాయంకాలానికంతా తిరిగొచ్చేస్తారని ఆశ్రమం మేనేజరు విజయకుమార్ చెప్పారు. పింఛను డబ్బును ఇక్కడే పంపిణీ చేసేందుకు ప్రభుత్వం అనుమతిస్తే వృద్ధులందరికీ పెద్ద వెసులుబాటు అవుతుందని కూడా ఆయన పేర్కొన్నారు.



కన్నబిడ్డలు పట్టించుకోకనే..

తమ కన్నబిడ్డలు పట్టించుకోనందువల్లే వయోవృద్ధులు ఆశ్రయం కోసం ఆశ్రమానికొస్తున్నారు. వారికి ఇక్కడ ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూసుకుంటున్నాం. అందుకే వారు ఆశ్రమాన్ని ఇష్టపడుతున్నారు. బయట నుంచి తెచ్చే వంటలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించం. ఎవరైనా దాతలు నగదును, వస్తువులను విరాళంగా ఇస్తుంటారు. ఇక్కడున్న పరిసరాలు చూస్తే దాతలకు కూడా మంచి అభిప్రాయం కలుగుతుంది. తమ తల్లిదండ్రులు ఆశ్రమంలో ఉన్నారని తెలిసినా నచ్చజెప్పి తీసుకుపోవడానికి కూడా ఎవరూ రారు. ఈ కారణంగా వారు ఆశ్రమంలో ఉండటానికే ఇష్టపడతారు. మరిన్ని ఆధునిక వసతులతో ఆశ్రమాన్ని విస్తరించేందుకు ప్రయత్నిస్తున్నాం.

- విజయకుమార్, మేనేజరు, సర్వోదయ వృద్ధాశ్రమం

24 మంది బైండోవర్

బి.కొత్తకోట, అక్టోబరు 8: బి.కొత్తకోట పట్టణంలో 24 మందిని పోలీసులు డిప్యూటి తహసీల్దారు మహమ్మద్ అన్సారీ ఎదుట హాజరు పరచి బైండోవర్ చేశారు. వినాయక చవితి వేడుకలలో బాగంగా డాన్సులు వేసి రెచ్చగొట్టారన్న అభియోగం తో 24 మందిపై పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. దీంతో వారిని పోలీసులు డిప్యూటీ తహసీల్దారు ఎదుట బైండోవర్ చేశారు.

దంపతుల అదృశ్యంపై ఫిర్యాదు

పీలేరు, అక్టోబరు 8: కేవీపల్లె మండలం చింత మాకులపల్లెకు చెందిన పి.రెడ్డిశేఖర్(38), తన భార్య దీప(30) అదృశ్యంపై మంగళవారం పీలేరు పోలీసులకు ఫిర్యాదు అందింది. రెడ్డిశేఖర్ తండ్రి రెడ్డప్ప నాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు వారి ఆచూకీ కోసం దర్యాప్తు చేస్తున్నారు.

కేబుల్ వైర్ల చోరీలపై ఫిర్యాదు

బి.కొత్తకోట, అక్టోబరు 8: మండలంలోని అచ్చమ్మకోట గ్రామ పరిసరాలలో వ్యవసాయ మోటర్లకు అమర్చిన కేబుల్ వైర్లు చోరీ అయినట్లు బాధిత రైతులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాగునీటి పథకం బోరుకు సంబంధించిన దాదాపు 70 మీటర్ల కేబుల్ వైర్లతో పాటు స్థానిక రైతులు అమరనాథరెడ్డి, సుధాకర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనాథరెడ్డిల వ్యవసాయ బోర్ల వద్ద కూడా కేబుల్ వైర్లను కత్తిరించుకు వెళ్లారని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ రాజారెడ్డి దర్యాప్తు చేస్తున్నారు.

ఆవుల దొంగలు అరెస్టు

పీలేరు, అక్టోబరు 8: కేవీపల్లె మండలంలో గత కొన్ని రోజులుగా కలకలం రేపిన ఆవుల దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. కేవీపల్లె ఏఎస్‌ఐ పీజీ లక్ష్మీదేవి కథనం మేరకు లక్కిరెడ్డిగారిపల్లె గ్రామానికి చెందిన ఎస్.ఖాజా ఇటీవల మండలంలోని మూడు ఆవులను దొంగలించి వాటిని అమ్మి సొమ్ము చేసుకున్నాడు. పీలేరు పట్టణం కట్టుకాలువ వీధికి చెందిన అతని బంధువు ఎస్.సలీనా ఈ అమ్మకాల్లో అతనికి సహకరించింది. పాడిరైతుల ఫిర్యాదుల మేరకు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు మంగళ వారం .ఖాజా, ఎస్.సలీనాలను అరెస్టు చేసి వారు అమ్మేసిన ఆవులను రికవర్ చేసి వారి రిమాండుకు తరలించారు.

బాలికల అదృశ్యంపై కేసు నమోదు

నిమ్మనపల్లి, అక్టోబరు 8: ఇద్దరు మైనర్ బాలికలు ఇంట్లో చెప్పకుండా వెళ్లి పోవడంతో కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ శివరాయకృష్ణ తెలిపారు. గత రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయారని పోలీసులకు పిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఇద్దరి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

టీడీపీ నేతల కుటుంబాలకు పరామర్శ

తంబళ్లపల్లె, అక్టోబరు 8: తంబళ్లపల్లె టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి నాయుడు, కోసువారిపల్లె టీడీపీ నేత కృష్ణమూర్తి కుటుంబాలను టీడీపీ నేత జయచంద్రారెడ్డి మంగళవారం పరామర్శించారు. కృష్ణమూర్తి నాయుడు తల్లి శాంతమ్మ సోమవారం అనారోగ్యంతో మరణించింది. ఈ విషయం తెలుసుకున్న జయచంద్రారెడ్డి మంగళవారం కూటమి నాయకులతో కలసి శాం తమ్మ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పిం చారు. కుటుంబసభ్యులకు సానుభూతి తెలియచేశారు. అలాగే కోసువారిపల్లెకు చెందిన టీడీపీ నేత కృష్ణమూర్తి కుమారుడు నగేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. టీడీపీ నేతలు ఆయన ఇంటి వద్దకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, సిద్దమ్మ, రాష్ట్ర బీసీ ఉపాధ్యక్షుడు తులసీ. దర్‌నాయుడు, పార్లమెంట్ బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి సోముశేఖర్, క్లస్టర్ ఇన్‌చార్జి బేరిశీన, పురు షోత్తం, జయరాంరెడ్డి, తరుగు శివారెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రామచంద్ర, కాలానారాయణ, స్వామిరెడ్డి, ఆనంద్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పోతబోలు సంఘమిత్రపై సీఎం పేషికి ఫిర్యాదు

- రూ.50లక్షలు అవినీతి జరిగిందంటూ ఆరోపణలు
- విచారణ ప్రారంభించిన డీఆర్‌డీఏ అధికారులు


పోతబోలులో సంఘమిత్ర పుణ్యవతిని విచారిస్తున్న డీఆర్‌డీఏ అధికారులు

మదనపల్లె టౌన్, అక్టోబరు 8: మదనపల్లె మండలం పోతబోలు గ్రామ సంఘమిత్ర రూ.50లక్షల దాకా అవినీతికి పాల్పడిందని, ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులు జమ చేసిన రుణాలను కాజేసిందని గ్రామానికి చెందిన మహిళలు సీఎం పేషికి ఫిర్యాదు చేశారు. అధికారులను గుప్పెట్లో పెట్టుకుని సంఘ సభ్యురాళ్లను బూతులు తిడుతోందని వారు ఆరోపించారు. ఈ క్రమంలో మంగళవారం రాయచోటి నుంచి డీఆర్‌డీఏ అధికారులు పోతబోలుకు వచ్చి విచారణ ప్రారంభించారు. పోతబోలు గ్రామంలో 35 ఎస్‌హెచ్‌జీ గ్రూపుల్లో 350 మంది సభ్యులు ఉండగా వారందరు శ్రీనిధి, ఉన్నతి, సీఐఎఫ్ పథకాల కింద రుణాలు తీసుకుని, ప్రతి నెలా బ్యాంకులో జమ చేస్తున్నారు. కాని ఈ గ్రూపులను అజమాయిషీ చేసే సంఘమిత్ర పుణ్యవతి రూ.50లక్షల దాకా సంఘాల సొమ్ము వాడుకుని, రూ.5 వడ్డీకి తిప్పుతోందని గ్రామస్థులు గత నెల 30వ తేదీన సీఎం పేషికి ఫిర్యాదు చేశారు. సీఎం పేషీ ఆదేశాలతో డీఆర్‌డీఏ డీపీఎం లక్ష్మీప్రసాదరెడ్డి నాయకత్వాన నలుగురు అధికారులు మంగళవారం పోతబోలుకు వచ్చి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా సంఘమిత్ర పుణ్యవతిని అన్ని రికార్డులు తీసుకొచ్చి అధికారుల ముందు పెట్టారు. వాటిలో ముఖ్యంగా శ్రీనిధి, ఉన్నతి, సీఐఎఫ్ రుణాలు ఎంత తీసుకున్నారని అధికారులు పరిశీలించగా సుమారు రూ.6 నుంచి రూ.7లక్షల దాకా వ్యత్యాసం ఉన్నట్లు అధికారుల దృష్టికి వచ్చింది. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌జీ సభ్యులు అధికారులతో మాట్లాడుతూ తమను కూడా విచారిస్తే సంఘమిత్ర పాల్పడిన అవినీతికి ఆధారాలు చూపిస్తామని తెలిపారు. దీనిపై డీపీఎం మాట్లాడుతూ మరో రెండు రోజుల పాటు విచారణ కొనసాగిస్తామని, ఎస్‌హెచ్‌జీ సభ్యులను కూడా విచారిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం ఉదయకుమార్, శ్రీనిధి మేనేజర్ హేమంత్, డీఎంజీ మధుబాబు, మదనపల్లె ఏపీఎం సుబ్రమణ్యం పాల్గొన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి


యాజమాన్య పద్ధతులను రైతులకు వివరిస్తున్న హెచ్‌వో సుకుమార్ రెడ్డి

పీలేరు, అక్టోబరు 8: మేలైన యాజమాన్య పద్ధతులతో మామిడిలో అధిక దిగుబడి సాధించవచ్చని పీలేరు మండల ఉద్యాన శాఖాధికారి సుకుమార్ రెడ్డి మామిడి రైతులకు సూచించారు. ఉద్యాన, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం గూడరేవుపల్లె పంచాయతీలో పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుకుమార్ రెడ్డి మాట్లాడుతూ తెల్ల పూత దశలో ఉన్నప్పుడు ఎటువంటి మందులు పిచికారి చేయరాదని సూచించారు. నల్ల పూత లేదా పిందె దశలో తామర పురుగులు, పక్షి కన్ను తెగులు, కాయ తొలుచు పురుగు నివారించడానికి ఒక లీటరు నీటికి 2 మిల్లీలీటర్ల ఫిప్రోనిల్, ఒక గ్రాము థయోఫినైట్ మిథైల్ కలిపి పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో రమాదేవి, వీహెచ్‌ఏ రాజేశ్వరి, రైతులు పాల్గొన్నారు.


పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయాధికారిణి ప్రేమలత

పెద్దతిప్పసముద్రంలో: మండల కేంద్రమైన పీటీఎంలో మండల వ్యవసాయాధికారిణి ప్రేమలత రైతులతో కలసి పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాతుతూ ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం రైతుల చెంతకే అధికారులు వచ్చి వ్యవసాయంలో మెలకువలపై అవగాహన కల్పిస్తున్నారన్నారు. రైతులకు ప్రభుత్వం అందించే యంత్ర పరికరాలు పలు సంక్షేమ పథకాలను ఎలా వినియోగించుకోవాలనే వాటిని ఆమె వివరించారు. ఈకార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో: వ్యవసాయంలో ఆధునాతన పద్ధతులను పాటించాలని పెద్దమండ్యం ఏవో సురేష్‌బాబు రైతులకు సూచించారు. మండలంలోని కోటకాడపల్లి పరిధిలో మంగళవారం జరిగిన పొలంపిలుస్తోంది కార్యక్రమంలో ఏవో పాల్గొని మాట్లాడుతూ విత్తనశుద్ధితో మంచి దిగుబడులు వస్తాయన్నారు. పంటలకు తెగుళ్లు సోకిన వెంటనే నివారణకు సూచనలకు వ్యసాధికారులను సంప్రదించి అదునులో ఏ పంటలు సాగు చేయాలో వ్యవసాధికారుల సలహాలను తీసుకోవాలని రైతులకు సూచించారు. వ్యవసాయ సహాయకులు అనుదీప్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో క్రీడామైదానాలు ఏర్పాటు చేయండి


స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్‌ను కలిసిన తంబళ్లపల్లె టీడీపీ నేతలు

కురబలకోట, అక్టోబరు 8: నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలకు క్రీడా మైదానాలు లేవని, క్రీడామైదానాలను మంజూరు చేయాలని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ రవినాయుడును తంబళ్లపల్లె నియోజకవర్గానికి చెందిన పలువురు టీడీపీ నేతలు విజ్ఞప్తి చేశారు. మంగళవారం తిరుపతిలోని ఆయన నివాసంలో తంబళ్లపల్లె నియోజకవర్గ కో ఆర్డినేటర్ మల్లికార్జుననాయుడు, రాజంపేట పార్లమెంటరీ తెలుగుయువత ప్రధాన కార్యదర్శి అయూబ్ బాషాలు ఆయనను కలిసి అభినందించి దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలకు క్రీడా మైదానాలు మంజూరు చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. అలాగే నియోజకర్గంలో పర్యటించాలని కోరారు. త్వరలోనే నియోజకవర్గంలో పర్యటిస్తానని హామీ ఇచ్చారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో జ్ఞానాంబిక విద్యార్థుల ప్రతిభ


సిల్వర్ మెడల్స్ సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ గురుప్రసాద్

మదనపల్లె టౌన్, అక్టోబరు 8: ఏపీ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మదనపల్లె జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. ఈ నెల 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకు రాజమండ్రిలో నిర్వహించిన 37వ అంతర్ జిల్లా అథ్లెటిక్స్ పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి జ్ఞానాంబిక విద్యార్థులు 400 మీటర్ల మిక్స్‌డ్ రిలే పరుగుపందెంలో పాల్గొన్నారు. ఈ పోటీల్లో ముగ్గురు విద్యార్థులు పి.మనోజ్, వి.రుచిత, కె.గాయత్రి అత్యుత్తమ ప్రతిభ కనపరచి సిల్వర్ మెడల్స్ దక్కించుకున్నారు. వారిని కళాశాల కరస్పాండెంట్ రాటకొండ గురుప్రసాద్, ప్రిన్సిపాల్ రమాదేవి, పీడీలు శరత్‌నాయక్, జగదీష్ అభినందించారు.

హార్సిలీహిల్స్ టోల్‌గేట్ ఇంకా రెవెన్యూ ఆధీనంలోనే..

బి.కొత్తకోట, అక్టోబరు 8: బి.కొత్తకోట మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ టోల్‌గేట్ ఇంకా రెవెన్యూ శాఖ ఆధీనంలోనే కొనసాగు తోంది. గత నెల 30న మదనపల్లె సబ్ కలెక్టరు కార్యాలయంలో హార్సిలీహిల్స్ టోల్‌గేట్‌లో వాహనాలపై రుసుము వసూలు చేసుకునే హక్కు కోసం వేలం పాటు నిర్వహించారు. ఈ పాటలలో రూ.46.20లక్షలకు పాడుకుని ఓ వ్యక్తి హార్సిలీహిల్స్ టోల్‌గేట్ నిర్వహణ హక్కును దక్కించుకున్నాడు. అయితే నిబంధనల మేరకు అతను ప్రభుత్వానికి పైకం చెల్లించక పోవడంతో మంగళవారం రెవెన్యూ సిబ్బందిచే హార్సిలీహిల్స్ పై వెళ్లే వాహనాల నుంచి రుసుము వసూలు చేసినట్లు డిప్యూటీ తహసీల్దారు మహమ్మద్ అన్సారీ తెలిపారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త వహించాలి

కలకడ, అక్టోబరు 8: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జాతీయ ఆరోగ్యమిషన్ జిల్లా అధికారి మునీశ్వర సూచించారు. మంగళవారం ఎర్రకోటపల్లె ఆసుపత్రిలో ఆశా డే సందర్భంగా ఆయన మా ట్లాడుతూ కలుషిత ఆహారం, తాగునీరు వలన కలిగే ఆరోగ్య సమస్యలు వస్తాయ ని ప్రజలకు అవగాహన కల్పించారు. డాక్టర్లు కిశోర్‌కుమార్‌రెడ్డి, జవహర్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు

గుర్రంకొండ, అక్టోబరు 8: హర్యానాలో బీజేపీ మూడవ సారి అధికారం దక్కించుకోవడంతో గుర్రంకొండలో ఆపార్టీ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రామాంజులు, భరత్, హరీష్, శ్రీనివాసులు, ఆదినారాయణ, వెంకటేష్, రామూర్తి పాల్గొన్నారు.

వీఆర్‌వోలు బాధ్యతగా పని చేయాలి

పెద్దమండ్యం, అక్టోబరు 8: వీఆరోవోలు బాధ్యతగా పని చేయాలని పెద్దమండ్యం తహసీల్దార్ సయ్యద్ అహ్మద్ ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వీఆర్‌వోల సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ తప్పులూ లేని ఓటరు జాబితా సిద్ధం చేయడంతోపాటు ఫ్రీహోల్డ్ ల్యాండ్ వెరిఫికెషన్ పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పట్టదారు పాసుపుస్తకం కోసం మ్యుటేషన్ దరఖాస్తు వివరాలను పరిశీలించాలన్నారు. మండల సర్వేయర్ హసీన్‌తాజ్, మండల ఆర్‌ఐ రమేష్, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో ముఖ్యమంత్రి కార్యదర్శి


ప్రద్యుమ్నకు జ్ఞాపికను అందిస్తున్న కలెక్టర్, ఏఈవో

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 8: ముఖ్యమంత్రి చంద్రబాబు కార్యదర్శి ప్రద్యుమ్న కాణిపాక వరసిద్ధి వినాయకస్వామిని మంగళవారం దర్శించుకున్నారు. ఏఈవో రవీంద్ర బాబు ఆహ్వానించి, దర్శన ఏర్పాట్లు చేశారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరి, ఆర్డీవో శ్రీనివాసులు, సూపరింటెండెంట్ వాసు తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు వరసిద్ధుడి పట్టువస్త్రాలు


పట్టువస్త్రాలు తీసుకెళుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో గురుప్రసాద్

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 8: విజయవాడ ఇంద్రకీలాద్రి కనకదుర్గ ఆలయంలో జరుగుతున్న శరన్నవ రాత్రి ఉత్సవాల సందర్భంగా కాణిపాక వరసిద్ధుడి ఆలయం తరఫున పట్టువస్త్రాలను పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో గురుప్రసాద్ మంగళవారం సమర్పించారు. వీరిని కనకదుర్గ ఆలయ ఈవో రామారావు ఆహ్వానించి, దర్శన ఏర్పాట్లను చేశారు. ఈ కార్యక్రమంలో విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు, డీసీ రత్నంరాజు, కాణిపాక ఆలయ మాజీ చైర్మన్ మణినాయుడు, ఐరాల టీడీపీ అధ్యక్షుడు గిరిధరబాబు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ కోచింగ్ సెంటర్ల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు, అక్టోబరు 8: ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీపై కోచింగ్ ఇవ్వడానికి అర్హత, ఆసక్తి కలిగిన కోచింగ్ సెంటర్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా సాంఘిక సంక్షేమం, సాధికారిత అధికారి రాజ్యలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కనీసం రెండు డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌లకు కోచింగ్ ఇచ్చిన కోచింగ్ సెంటర్ల వారు అర్హులన్నారు. అలాగే కనీసం వంద మంది టీచర్లుగా ఉద్యోగాలు పొంది ఉండాలని, మూడేళ్ల సరాసరి టర్నోవర్ కనీసం రూ.40 లక్షలు ఉండాలన్నారు. ఈనెల 21వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. https:\\tender.apeprocurement.gov.in వెబ్‌సైట్‌లో డాక్యుమెంట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

టెట్‌కు 398 మంది హాజరు

చిత్తూరు (సెంట్రల్), అక్టోబరు 8: టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్టు (టెట్)కు మంగళవారం 398 మంది అభ్యర్థులు హాజరయ్యారు. జిల్లాలోని ఎస్వీ సెట్, మదర్‌థెరీసా కళాశాలల్లో ఉదయం, మధ్యాహ్నం సెషన్స్‌లో జరిగిన పరీక్షలకు 460 మందికిగాను 62మంది గైర్హాజరయ్యారు. ఉదయం సెషన్‌లో 230 మందికిగాను 198 మంది, మధ్యాహ్నం సెషన్‌లో 230 మందికిగాను 200 మంది హాజరైనట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.

కేజీబీవీల్లో నాన్ టీచింగ్ పోస్టుల భర్తీ

చిత్తూరు (సెంట్రల్), అక్టోబరు 8: జిల్లాలోని ఎనిమిది కేజీబీవీల్లో ఖాళీలుగా ఉన్న 15 నాన్ టీచింగ్ పోస్టులను ఔట్ సోర్సింగ్ విధానంపై భర్తీ చేయనున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి 8 అసిస్టెంట్ కుక్, ఓ వాచర్ ఉమెన్, రెండు స్కావెంజర్స్, ఒక స్వీపర్, ఒక చౌకీదార్, రెండు హెడ్ కుక్ పోస్టులు భర్తీ చేయనున్నట్లు వివరించారు. ఓసీ మహిళలకు వయో పరిమితి 42 ఏళ్లన్నారు. అలాగే మాజీ సైనిక ఉద్యోగ మహిళలకు 45 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ మహిళా అభ్యర్థులకు 47, పీహెచ్‌సీ మహిళా అభ్యర్థులైతే 52 ఏళ్ల వరకు అర్హులన్నారు. అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 15వ తేదీలోపు సంబంధిత ఎంఈవో కార్యాలయాల్లో సమర్పించాలన్నారు.

తిరుపతి ఇన్‌చార్జి ఆర్డీవోగా రామ్మోహన్ బాధ్యతల స్వీకరణ



తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 8: తిరుపతి ఇన్‌చార్జి ఆర్డీవోగా బి.రామ్మోహన్‌ను కలెక్టర్ వెంకటేశ్వర్ నియమించారు. ప్రస్తుతం ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయనను అదనంగా తిరుపతి ఇన్‌చార్జి ఆర్డీవోగా నియమించారు. ఇక్కడ ఆర్డీవోగా పనిచేస్తున్న నిశాంత్‌రెడ్డిపై వచ్చిన ఆరోపణల ఆధారంగా ప్రభుత్వం సస్పెండ్ చేసింది. తరువాత శ్రీకాళహస్తి ఆర్డీవోగా ఉన్న రవిశంకర్‌రెడ్డికి తిరుపతి ఆర్డీవోగా అదనంగా బాధ్యతలు అప్పగించారు. ఆయన కూడా బదిలీ కావడంతో రామ్మోహన్‌ను ఇన్‌చార్జి ఆర్డీవోగా నియమించారు. మంగళవారం ఇన్‌చార్జి ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన రామ్మోహన్‌ను పలువురు తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు అభినందించారు.

స్విమ్స్‌లో రేపు రాయితీతో వైద్య పరీక్షలు

తిరుపతి(వైద్యం), అక్టోబరు 8: ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా స్విమ్స్‌లోని బయోకెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 10న 50 శాతం రాయితీతో వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే వేల్‌ప్రోరిక్ యాసిడ్, లిథియం పరీక్షలకు ఒక్కో పరీక్షను కూడా రూ.150లకే నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. రాయితీతో నిర్వహించే వైద్య పరీక్షలను అవసరమైన రోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

క్రీడారంగంలో విప్లవాత్మక మార్పులు

తీసుకొస్తామన్న శాప్ చైర్మన్ రవి నాయుడు


కలెక్టర్‌ను సన్మానిస్తున్న రవి నాయుడు

తిరుపతి (కలెక్టరేట్), అక్టోబరు 8: క్రీడారంగంలో ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) విప్లవాత్మకమైన మార్పులు తీసుకువస్తుందని చైర్మన్ రవి నాయుడు పేర్కొన్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్‌ను జిల్లా టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్‌తో కలిసి రవి నాయుడు మంగళవారం కలిశారు.తిరుపతి, విజయవాడ, కాకినాడ, విశాఖపట్టణం ప్రాంతాల్లో క్రీడారంగాన్ని అభివృద్ధి చేయడమే శాప్ లక్ష్యమని చెప్పారు.జిల్లాలో శాప్‌కు 38 ఎకరాలు అవసరముందని, శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను అభివృద్ధి చేసేందుకు స్మార్ట్‌సిటీ నిధులను కేటాయించాలని కోరారు. 2014-19లో టీడీపీ ప్రభుత్వం తిరుపతి స్పోర్ట్స్ విలేజీకి 145 ఎకరాలు కేటాయిస్తే, ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ భూమిని లేఅవుట్‌గా మార్చి అమ్మేసిందన్నారు. తిరుపతిలో స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటుకు టీడీపీ ప్రభుత్వం క్రీడాకారులకు ఇచ్చిన భూములు నిరుపయోగంగా ఉన్నాయని, అకాడమీల ఏర్పాటుకు చర్యలు తీసుకునేలా ఆదేశించాలని రవి నాయుడు కలెక్టర్‌ను కోరారు.సానుకూలంగా స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మోడల్ సెంటర్లను తీర్చిదిద్దాలని సూచించారు. క్రీడారంగానికి సమకూర్చాల్సిన నిధుల విషయంలో పూర్తి సహకారమందిస్తామన్నారు.

ఏకలవ్య పాఠశాలల్లో అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 8: తిరుపతి జిల్లాలో ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ స్కూల్స్ (ఓజిలి, బీఎన్‌కండ్రిగ)లో ఈ విద్యా సంవత్సరంలో గెస్ట్ టీచర్లుగా సీబీఎస్ఈ సిలబస్ బోధించేందుకు అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పీజీటీ -తెలుగు2, ఫిజిక్స్ 1, బయాలజీ 1, టీజీటీ -హిందీ బోధించేందుకు 21 నుంచి 60 సంవత్సరాలు అర్హత గలవారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. నవోదయ, కేంద్రీయ విద్యాలయం, స్టేట్ గవర్నమెంట్ సంస్థల నుంచి పదవీ విరమణ పొందిన 60 నుంచి 65 సంవత్సరాల ఉపాధ్యాయులు ఈ నెల 18లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత కార్యాలయం, బి బ్లాక్, 5వ ఫ్లోర్, రూమ్‌నెంబర్ - 504లో అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 94935 24121 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

అంగన్వాడీ కేంద్రాలకు మహర్దశ

మౌలిక వసతులకు ప్రభుత్వం చర్యలు ● జిల్లాకు రూ.2.20 కోట్ల మంజూరు

చిత్తూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యపు నష్టాన్ని కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా సరిచేస్తూ వస్తోంది. గత ప్రభుత్వ హయాంలో అంగన్వాడీ కేంద్రాల్లో సౌకర్యాలు లేక గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఇబ్బందులు పడ్డారు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు మరుగుదొడ్లు లేక, తాగేందుకు నీళ్ల లేక అవస్థలు పడేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టింది. కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నచోట అవసరమైన మౌలిక వసతుల్ని కల్పించనున్నారు. మరుగుదొడ్లు, తాగునీటి వసతి కల్పనకు సంబంధించిన పనులు చేసేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ విభాగానికి అప్పగించారు. ఒక్కో మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.36 వేలు, తాగునీటి కోసం ఒక్కో ఆర్వో ప్లాంటు ఏర్పాటుకు రూ.17వేల చొప్పున ఖర్చు చేయనున్నారు.

380 కేంద్రాల్లో మరుగుదొడ్లు, 490 చోట్ల తాగునీటి సౌకర్యానికి చర్యలు

జిల్లాలో మొత్తం 2,420 అంగన్వాడీ కేంద్రాలుండగా.. ఎన్నిచోట్ల సదుపాయాలు కల్పించాలో గుర్తించారు. 380 కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.36 వేల చొప్పున రూ.1.368 కోట్లు, 490 చోట్ల తాగునీటి సౌకర్యం కల్పించేందుకు రూ.17వేల చొప్పున రూ.83.30 లక్షలు.. మొత్తంగా రూ.2.20 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. పనుల్ని త్వరలో ప్రారంభించేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు చేపడుతున్నారు.



పులిచెర్ల మండలం మిట్టమీదరాచపల్లె అంగన్వాడీ కేంద్రం

త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు



సొంత భవనాలున్న అంగన్వాడీ కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు నిధులు మంజూరయ్యాయి. తాగునీటి సౌకర్యంతోపాటు మరుగుదొడ్ల నిర్మాణానికి అనుమతులిచ్చాం. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమన్వయం చేసుకుని వీలైనంత త్వరగా పనులు పూర్తి చేస్తాం.

- హైమావతి, ఐసీడీఎస్ పీడీ

నీవానదిలో ఇసుక తవ్వకాలు

● తమిళనాడువాసి యంత్రాల సీజ్



ఇసుక తవ్వకాలకు వాడిన యంత్రాలను సీజ్ చేసిన తహసీల్దార్ చంద్రశేఖర్, సీఐ లక్ష్మీనారాయణ - నీవానది యేటిప్రాంతంలో ట్రాక్టరుకు ఇసుక లోడింగు

గంగాధరనెల్లూరు, అక్టోబరు 8 : గంగాధరనెల్లూరు మండలం కొత్రకోన పంచాయతీ గారంపల్లె సమీపంలోని నీవానది యేటి ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణాను అధికారులు అడ్డుకున్నారు. తమిళనాడువాసికి చెందిన రెండు ఎక్స్‌కవేటరును సీజ్ చేశారు.ఎమ్మెల్యే థామస్ పేరుచెప్పి స్థానిక టీడీపీ నేతలతో కలిసి తమిళనాడుకు చెందిన వ్యాపారి మూడు రోజులుగా అక్కడి ఇసుకను అక్రమంగా తరలించినట్లు సమాచారం.పేద ప్రజలు ఇళ్లనిర్మాణ పనులకు సమీపంలోని వాగులు, వంకల్లో కూలీలతో ఇసుకను ఉచితంగా తీసుకెళ్లడానికి ప్రభుత్వం అనుమతించింది. అయితే నీవానది యేటిలో యంత్రాలతో ఇసుకను గుట్టగా పోసుకుని ట్రాక్టర్లకు లోడ్‌చేసి తరలిస్తున్నారు. రోజుకు రెండువందల ట్రాక్టర్లకు పైగా గారంపల్లె నుండి ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం.ఈ విషయం కలెక్టర్ సుమిత్‌కుమార్ దృష్టికి మంగళవారం వెళ్లడంతో వెంటనే ఆయన అధికారులను గారంపల్లెకు వెళ్ళి పరిశీలించమన్నారు. దీంతో తహసీల్దార్ చంద్రశేఖర్, సీఐ లక్ష్మీనారాయణ, వీఆర్వో భాస్కర్ నీవా నదిలో ఇసుకతవ్వకాలకు వినియోగిస్తున్న హిటాచీ యంత్రాలను సీజ్‌చేసి , ఆ విషయాన్ని కలెక్టర్‌కు నివేదించారు.కొంతమంది కూలీలు నీవానది యేటిలో ఇసుకను యంత్రాలతో తవ్వి ట్రాక్టర్లకు లోడ్‌చేయడాన్ని గమనించి అక్కడున్న టీడీపీ నేతను నిలదీశారు.దీంతో ఆయన ఎమ్మెల్యేతో మాట్లాడి పని కల్పిస్తామంటూ కూలీలను అక్కడనుంచి పంపించేశాడు. కాగా ఇసుక తవ్వకాలకు వాడిన యంత్రాలకు జరిమానాలను తహసీల్దార్, మైన్స్ అధికారులు కలిసి నిర్ణయించనున్నట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

నకిలీ ఆభరణాలతో రూ.కోట్ల మోసం

● ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన నలుగురి అరెస్టు

చెన్నై, అక్టోబరు 8: తమిళనాడు రాష్ట్రం తిరువళ్ళూరు జిల్లా తిరుత్తణి సమీపం కనకమ్మసత్రంలోని బ్యాంకులు, బంగారు దుకాణాల్లో నకిలీ నగలు కుదవ పెట్టి కోట్లాది రూపాయల మేర మోసం చేసిన కేసులో నలుగురు మహిళలు సహా ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల కనకమ్మసత్రంలో నకిలీ నగలను కదువపెట్టి రూ.2.15 లక్షల మోసం చేసిన కేసు వెలుగులోకి వచ్చింది. దీనిపై స్థానిక పోలీసులు లోతుగా దర్యాప్తు చేపట్టగా, మరో మోసం వెలుగులోకి వచ్చింది. 40 శాతం బంగారం కలిపిన నకిలీ ఆభరణాలను బ్యాంకులు, కుదువ షాపుల్లో తాకట్టుపెట్టి కోట్లాది రూపాయల మేర మోసం చేసినట్టు గుర్తించారు. రేణిగుంటకు చెందిన హరిత (34), మదనపల్లెకు చెందిన రామాంజనేయులు (50), విజయపురానికి చెందిన లత (48), పుత్తూరుకు చెందిన చంద్రశేఖర్ (39), తిరుత్తణి, వీకేఎన్ కండ్రికకు చెందిన రేఖ (35), మల్లారెడ్డి కండ్రిగకు చెందిన తులసి (28) అనే వారిని అరెస్టు చేశారు. వీరంతా కలిసి పలు గ్రామాల్లోని మహిళలకు నకిలీ బంగారు నగలు ఇచ్చి వాటిని బ్యాంకులు, బంగారు దుకాణాల్లో కుదువ పెట్టించి డబ్బులు తీసుకున్నట్టు వెల్లడైంది.

వైసీపీ బలోపేతమే లక్ష్యంగా పనిచేద్దాం

● మాజీ మంత్రి పెద్దిరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

తిరుపతి (జీవకోన), అక్టోబరు 8: వైసీపీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేద్దామని మాజీ మంత్రి, తిరుపతి, చిత్తూరు జిల్లాల వైసీపీ అధ్యక్షుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం తిరుపతిలోని పీఎల్‌ఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఉమ్మడి జిల్లాల సమన్వయకర్తల అంతర్గత సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో పార్టీ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, భవిష్యత్తు కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలు, నాయకులకు తగిన గుర్తింపు ఇవ్వాలన్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, మాజీ ఎంపీ రెడ్డెప్ప, మాజీ ఎమ్మెల్యేలు వెంకట గౌడ, డాక్టర్ సునీల్, సమన్వయకర్తలు రాజేష్, విజయానందరెడ్డి, కృపారాణి, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎవరికి వచ్చినా మనందరికీ మద్యం షాపు?

వెదురుకుప్పం, అక్టోబరు 8: లాటరీ పద్ధతిలో మద్యం దుకాణం ఎవరికి వచ్చినా మన 'అందరికీ' అందులో వాటా ఉండాలి. ఇది ఓ పార్టీ నాయకుల తీర్మానం. గంగాధరనెల్లూరు నియోజకవర్గ పరిధిలో 14 (వెదురుకుప్పంలో 2, పాలసముద్రంలో 1, కార్వేటినగరంలో 3, ఎస్‌ఆర్ పురంలో 2, పెనుమూరులో 2, గంగాధరనెల్లూరులో 4) ప్రైవేటు మద్యం దుకాణాలకు ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ నేపథ్యంలో అక్కడక్కడా చోటా నాయకులు మద్యం దుకాణాలకు తమ అనుమతి లేకుండా ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోకూడదని మౌఖికంగా హుకుం జారీ చేశారు. కానీ, కొందరు దరఖాస్తులు చేసుకోవడంతో నయానో, భయానో బెదిరించాలనే ప్రయత్నం కూడా జరిగింది. అయినప్పటికీ చివరికి ఎవరికి వచ్చినా మనందరికీ వాటా అంటూ కొత్త నినాదంతో ముందుకొచ్చారు. ఈమేరకు ఆయా మండలాల్లో ద్వితీయశ్రేణి నాయకులు మంతనాలు జరిపారు. ఒక్కో దుకాణానికి సుమారు పది మంది వాటాదారులతో జరుపుకోవాలనే విధంగా చర్చలు జరిగినట్లు సమాచారం. ప్రధానంగా మద్యం వ్యాపారం అధికంగా జరిగే మండలాలపై ప్రత్యేక దృష్టి సారించాని విశ్వసనీయ సమాచారం. వాటాలు ఎవరెవరికి ఉంటాయో? వీటి బాధ్యత ఎవరు తీసుకుంటారో వేచి చూడాలి.

వైసీపీ సర్పంచ్ నుంచి ప్రాణహాని

గుట్టమీదపల్లె రైతుల గోడు

పుంగనూరు, అక్టోబరు 8: తమ భూములు ఆక్రమించిన వైసీపీ సర్పంచ్ నుంచి ప్రాణహాని ఉందని రైతులు మునిరత్నం, ఎం.ప్రతాప్, బి.ఎల్లమ్మ, సి.మల్లయ్య, వి.నరసింహులు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం వారు ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ సదుం మండలం 79ఏ చింతమాకులపల్లె పంచాయతీ గుట్టమీదపల్లెకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాల వారికి చెందిన 20 ఎకరాల భూములను సర్పంచ్ ఎం.మల్లిఖార్జున ఆక్రమించాడని వాపోయారు. వైసీపీ ప్రభుత్వంలో తమ పొలాలను ఆక్రమించి, దాడులకు దిగిన విషయమై ఈఏడాది జూలైలో మదనపల్లెకు వచ్చిన రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియాకు ఫిర్యాదు చేశామన్నారు.దాంతో విచారించి న్యాయం చేయాలని కలెక్టర్ నుంచి తహసీల్దార్‌కు లేఖ వచ్చిందన్నారు. దీంతో ఈనెల నాలుగోతేదీ సదుం తహసీల్దారు, ఇతర అధికారులు విచారణకు వచ్చారని వివరించారు. ఆ సమయంలో అధికారుల ముందే తమను తుపాకీతో కాల్చి చంపేస్తానంటూ సర్పంచ్ బెదిరించాడని వాపోయారు. దీనిపై పుంగనూరుకు వచ్చిన మంత్రులు అనిత, రాంప్రసాద్‌రెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డిలకు విన్నవించామని పేర్కొన్నారు. ఐదేళ్లుగా తమ భూములను అనుభవిస్తున్న వైసీపీ సర్పంచ్ నుంచి తమ భూములను విడిపించి తమకు ఇప్పించాలని కోరారు.

వినియోగదారులకు స్మార్ట్ మీటర్లపై అవగాహన అవసరం

సీఎండీ కె.సంతోషరావు


కరపత్రాలు విడుదల చేస్తున్న సీఎండీ సంతోషరావు, అధికారులు


తిరుపతి (ఆటోనగర్), అక్టోబరు 8: విద్యుత్ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లపై అవగాహన అవసరమని ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ కె.సంతోషరావు వెల్లడించారు. తిరుపతిలోని కార్పొరేట్ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం స్మార్ట్ మీటర్ల గురించి ముద్రించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ సంస్థ పరిధిలో వాణిజ్య, పారిశ్రామిక విద్యుత్ సర్వీసులకు ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించనున్న తరుణంలో స్మార్ట్ మీటర్ల పనితీరును వివరించాలని సూచించారు. ఈ మీటర్లు అమర్చడం వల్ల ఎలాంటి నష్టం ఉండదన్న విషయాలను వినియోగదారులకు వివరించాలని ఆయన తెలిపారు. ఇప్పటికే సంస్థ పరిధిలో వున్న ప్రభుత్వ కార్యాలయాలకు, హెచ్‌టీ సర్వీసులకు విద్యుత్ మీటర్లు అమర్చినట్లు చెప్పారు. ఈ మీటర్లు అమర్చడం వల్ల ఎంత విద్యుత్ వినియోగం జరుగుతుందనేది అప్పటికప్పుడే వినియోగదారులు తెలుసుకుని, పొదుపు చేసుకోవచ్చని సీఎండీ వెల్లడించారు. సెక్షన్ స్థాయినుంచి దీనిపై ప్రచారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు లక్ష్మీనరసయ్య, అయూబ్‌ఖాన్, జీఎం చంద్రశేఖర్‌రెడ్డి, ఈఈలు వేణుగోపాల్ రావు, డీఈ ఈఈలు రాజేంద్ర ప్రసాద్, ఆదాని పాల్గొన్నారు.

తిరుమలలో ఎటుచూసినా కార్లే


తిరుమలలో రోడ్లపై బారులు తీరిన కార్లు

తిరుమల, అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): తిరుమల బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన గరుడసేవను వీక్షించేందుకు భక్తులు మంగళవారం వారి సొంత వాహనాల్లో తిరుమలకు భారీగా తరలివచ్చారు. దీంతో తిరుమల కొండపై ఎక్కడ చూసినా రోడ్లపై కార్లు బారులు తీరాయి. భక్తుల వాహనాలను నిలిపేందుకు తిరుమలలో 28 ప్రాంతాల్లో 9 వేల వాహనాలకు సరిపడ పార్కింగ్ ప్రదేశాలను టీటీడీ ఏర్పాటు చేసింది. అయితే అంచనాకు మించి వాహనాలు అధిక సంఖ్యలో రావడంతో పార్కింగ్ ప్రదేశాలు సరిపోక వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. తిరుమలలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు తిరుమలకు వచ్చే వాహనాలను జీఎన్‌సీ మీదుగా రింగ్‌రోడ్డు నుంచి పార్కింగ్ ప్రదేశాలకు తరలించే విధంగా ఏర్పాటు చేశారు. కానీ వాహనాల సంఖ్య పెరగడంతో పార్కింగ్ సరిపోక భక్తులు వారి వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేసి వదిలేశారు. దీంతో ట్రాఫిక్ సమస్య పెరిగి ఇతర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇక, ఆర్టీసీ బస్సులను కూడా భక్తులు బాగానే వినియోగించుకున్నారు. రాత్రి 8 గంటల సమయానికి 91 వేల మంది తిరుమలకు రాగా, 55 వేల మంది తిరుమల నుంచి తిరుపతికి ప్రయాణించారు.

మూలవిరాట్టు దర్శనానికీ క్యూలైన్లలో బారులు



గరుడసేవతో పాటు ఆలయంలోని మూలవిరాట్టు దర్శనానికి కూడా భక్తులు క్యూలైన్‌లో బారులు తీరాల్సి వచ్చింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లన్నీ నిండిపోవడంతో నారాయణగిరి ఉద్యానవనంలోని షెడ్లు కూడా నిండిపోయాయి. దీంతో క్యూలైన్ కృష్ణతేజ అతిథి గృహం మీదగా శిలాతోరణం సర్కిల్ వరకు దాదాపు రెండు కిలోమీటర్ల మేరకు వ్యాపించింది. వీరికి 20 గంటల దర్శన సమయం పడుతుంది.

పంటలపై ఆగని గజదాడులు


పాతపేట వద్ద వరిపంటను ధ్వంసం చేసిన ఏనుగుల గుంపు

కల్లూరు, అక్టోబర్ 8 : పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల దాడులు ఆగడం లేదు. 10 రోజుల క్రితం మండలంలోకి ప్రవేశించిన ఏనుగుల గుంపు కల్లూరు, పాతపేట, బోడిరెడ్డిగారిపల్లి, పాళెం, దేవళంపేట తదితర పంచాయతీల్లో పంటలను నాశనం చేస్తున్నాయి. మంగళవారం రాత్రి పాతపేట, కల్లూరు, దేవళంపేట, కమ్మపల్లి పంచాయతీల్లో ఏనుగుల గుంపు సంచరించాయి. వరి, టమోటా తదితర పంటలకు నష్టం వాటిల్లింది. పాతపేట వద్ద రైతు కె. సుబ్రమణ్యానికి చెందిన అర ఎకరా వరిపంట, మరో రైతు వైసుబ్రమణ్యానికి చెందిన టమోటా పంటను ధ్వంసం చేశాయి. కల్లూరు సమీపంలోని ఎద్దలవారిపల్లి వద్ద ఏనుగులు సంచరించడంతో గ్రామస్తులు భయాందోళన చెందారు. దేవళంపేట పంచాయతీ కొమ్మిరెడ్డిగారిపల్లి సమీపంలో రైతు కుమార్‌రెడ్డికి చెందిన రెండుకరాల వరిపంట, బోరు పైపులు, గేటువాల్వ్, రైతు లక్ష్మణరెడ్డికి చెందిన వరిపంట, కమ్మపల్లిలోని విజయసారథి నాయుడికి చెందిన వ్యవసాయ పైపులను ఏనుగులు ధ్వంసం చేశాయి.

నడిగడ్డలో చిరుత కలకలం

సదుం, అక్టోబరు 8: మండలంలోని నడిగడ్డ గ్రామ పరిసరాల్లో చిరుత పులి సంచరించినట్లు వదంతులు వ్యాపించాయి. మంగళవారం రాత్రి సుమారు 7 గంటల ప్రాంతంలో గ్రామ సమీపంలోని నాగల చెరువు మొరవలో చిరుత సంచరించినట్లు గ్రామస్తులు గుర్తించారు.